


# విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 07-07-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 295 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## మొదటి ప్రపంచ యుద్ధవీరులకు
# మోదీ నివాళులు

### - జర్మనీలో జరిగే జీ 20 సదస్సుకు హాజరుకానున్న మోదీ



ఇజ్రాయెల్: మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహుని కలిసిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పర్యటనలో భాగంగా నెతాన్యాహుతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం నెతాన్యాహు.. మోదీకి టెల్ అవీవ్ నగరంలోని ఓ ఇండియన్ రెస్టారెంట్‌లో విందు ఏర్పాటు చేశారు. అయితే నెతాన్యాహు అదే రెస్టారెంట్‌కి 30 ఏళ్ల క్రితం తన భార్యతో కలిసి డేట్‌కి వెళ్లినట్లు ఆయన మీడియా ద్వారా వెల్లడించారు. సరిగ్గా 30 ఏళ్ల క్రితం ఇదే రెస్టారెంట్‌కి నా భార్యతో వెళ్లాను. ఇక్కడ ఫుడ్ చాలా బాగుంటుంది. మోదీ వస్తున్న సందర్భంగా విందు ఏర్పాటు చేయమని రెస్టారెంట్ యజమాని రీనా పుష్కర్ణకి చెప్పాను. ఇప్పుడు నేను మోదీతోచేసిన డిన్నర్, నా భార్యతో వెళ్లిన డేట్ రెండూ ఒకేలా అనిపించాయి అని నెతాన్యాహు చమత్కరించారు.

పర్యటనలో భాగంగా గురువారం మోదీ మొదటి ప్రపంచయుద్ధ అమరవీరులకు నివాళులర్పించారు. మొదటి ప్రపంచయుద్ధంలో అమరులైన భారతీయ సైనికుల సమాధి వద్ద మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం యుద్ధంలో అమరుడైన

తరువాయి 2లో

## భారత్‌కు వ్యాపించిన థిలాపియా లేక్ వైరస్

**జాగ్రత్త పడాలంటున్న ఎంపెడా అధికారులు**



భీమవరం: చేపల సాగు ఉన్న దేశాలను థిలాపియా లేక్ వైరస్ వణికిస్తోంది. తాజాగా భారతదేశంలో కూడా వ్యాప్తి చెందినట్లు

తరువాయి 2లో

### ద్వైపాక్షిక సమావేశానికి వాతావరణం సరిగా లేదు
## బెట్టు చేస్తున్న చైనా

బీజింగ్ : చైనా బెట్టు చేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఆ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు వాతావరణం సరిగా లేదంటోంది. సిక్కిం సెక్టర్‌లో భారత్-చైనా మధ్య ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ఈ ప్రకటన చేశారు. జర్మనీలోని హాంబర్గ్‌లో జీ-20 సమావేశాలు శుక్రవారం నుంచి జరుగుతాయి. ఈ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ పాల్గొంటారు. ఈ

తరువాయి 2లో

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచిననాడే
# సంపూర్ణ స్వచ్ఛాంధ్ర సాధ్యం

**- 2019 అక్టోబరు2 నాటికి బహిరంగ రహిత మల విసర్జన భారత్‌కై విశేష కృషి**
**శాసనసభ సభాపతి డా.కోడెల శివప్రసాదరావు**



విశాఖపట్నం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచిననాడే సంపూర్ణంగా స్వచ్ఛాంధ్ర సాధన జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి డా.కోడెల శివప్రసాదరావు తెలిపారు. గురువారం వుడా చిల్డ్రన్ థియేటర్‌లో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సమ్మేళనం కార్యక్రమానికి స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలకు స్వేచ్ఛ భారత్ వచ్చిందిగాని, స్వచ్ఛభారత్ నేటికీ రాలేదని విచారణ వ్యక్తపరిచారు. 2019 అక్టోబరు2 నాటికి బహిరంగ రహిత మల విసర్జన భారత్‌గా తీర్చిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయన్నారు. రక్షిత మంచినీటిని తాగడం, పర్యావరణాన్ని కాపాడానికి అధికంగా మొక్కలు నాటడం, స్మశానవాటికల పరిశుభ్రత పాటించాలన్నారు. మన రాష్ట్రం అన్ని రంగాల్లోను మొదటి స్థానాలలో నిలుస్తున్నప్పటికి పారిశుధ్యంలో వెనుకబడి వున్నామన్నారు. నీటి కలుషితం ద్వారా డయేరియా, కలరా, కడుపులో నులిపురుగులు లాంటి అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. వీటిన్నంటిని అధిగమించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అదే విధంగా సంపూర్ణ

తరువాయి 8లో

## రైతు ఆత్మహత్యలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : రైతుల ఆత్మహత్యల సమస్యను రాత్రికి రాత్రే పరిష్కరించడం అసాధ్యమని సుప్రీంకోర్టు పేర్కొంది. తమకు ఒక సంవత్సరం గడువు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి అంగీకారం తెలిపింది. తాము ఫసల్ బీమా యోజన వంటి రైతు అనుకూల పథకాలను ప్రవేశపెట్టా మని, వాటి ఫలితాలను ఒక ఏడాదిలో తెలుస్తాయని ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్

తరువాయి 2లో

## హైకోర్టులోనే తేల్చుకోండి : సుప్రీం



దిల్లీ: వైకాపా ఎమ్మెల్యే రోజాను ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిన అంశంపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది.

ఈ కేసు వ్యవహారం హైకోర్టులో ఇంకా పెండింగ్ లోనే ఉన్నందున తాము జోక్యం చేసుకోలే మని స్పష్టం చేసింది. హైకోర్టులోనే ఈ కేసు అంశాన్ని తేల్చుకోవాలని రోజా తరపు న్యాయవాదులకు సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. రోజా ఇప్పటికే క్షమాపణ చెప్పారని, లేఖ కూడా పంపారంటూ ఆమె తరపున న్యాయవాదులు సుప్రీంకు తెలపగా.. రాష్ట్ర ప్రభుత్వానికి అందలేదని ప్రభుత్వం

తరువాయి 2లో

## సోషల్ మీడియాలోకి
# ఏపీ ఏసీబీ

విజయవాడ: రాష్ట్రంలో అవినీతిపరుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న అవినీతి నిరోధక శాఖ సోషల్ మీడియాలోకి ప్రవేశించింది. అవినీతి అధికారుల భరతం పట్టేందుకు భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలకు పదును పెట్టేందుకు రెండు రోజులపాటు విజయవాడలో ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ అధ్యక్షతన నిన్న సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశం చివరి రోజైన గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రముఖ సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విటర్ ఖాతాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ.. అక్రమాస్తులను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వాడుకొనేలా, బినామీలపైనా కఠిన చర్యలు తీసుకొనేందుకు చట్టాలను రూపకల్పన చేయనున్నట్టు చెప్పారు. అవినీతి నిరోధానికి ట్రిపుల్ పీ పద్ధతిని అమలుపరుస్తామన్నారు. సీబీఐ, కేంద్ర పన్నుల శాఖ అధికారులతోనూ చర్చలు జరుపుతున్నట్టు చెప్పారు. లంచగొండులు, అవినీతి అధికారుల గురించి బహిర్గతం చేయడంలో మీడియా సహకారం ఎంతో బాగుందన్నారు. అవినీతి వ్యవహారాలకు సంబంధించి ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మహిళలపై ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు



తిరువనంతపురం: బాధ్యతాయుతమైన పార్లమెంట్ సభ్యుడి హోదాలో ఉన్న వ్యక్తి.. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. మలయాళ చిత్రపరిశ్రమలో కాస్టింగ్ కౌచ్(అవకాశాల పేరుతో లోబరుచుకోవడం) పద్ధతి లేదని చెబుతూనే.. చెడ్డ మహిళలతోనే అలా ప్రవర్తిస్తారని అన్నారు. కేరళ ఎంపీ, ప్రముఖ మలయాళీ నటుడైన ఇన్నోసెంట్ తాజాగా

తరువాయి 2లో

## క్రికెట్ కోసం ఉద్యోగం వదులుకుని..

వార్తలో 8లో

## టేకిట్-ఈజీ



నావి మరీ పాడు అలవాట్లు కాదు... ఇది ఆరోగ్యం కోసం తీసుకుంటున్నా !!

## అధునాతన పద్ధతిలో
# విద్యాబోధనకు డిజిటల్ తరగతులు

- రూ.65 లక్షలతో స్మార్ట్ క్లాస్ రూమ్స్, సోలార్ రూఫ్ టాఫ్‌లు ప్రారంభం
- ప్రయోగాత్మకంగా తరగతులు ప్రారంభం - పిల్లల్లో సృజనాత్మకత పెంపొందడానికి - నాణ్యమైన విద్య
- రూ.3 కోట్లతో 124 పాఠశాలల్లో సోలార్ పవం - చినవాల్తేర్, కె.డి.పి.యంం యం.వి.డి పాఠశాలల్లో ప్రారంభం
- ఉత్తమ ఫలితాలు సాధన ద్వారా గుర్తింపు - విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయండి

**- విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు డా.కె.హరిబాబు**



విశాఖపట్నం : ది గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన స్మార్ట్ క్లాస్ రూమ్స్ ద్వారా డిజిటల్ తరగతులు అధునాతన పద్ధతిలో విద్యాబోధనకు దోహదపడుతుందని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు డా.కె.హరిబాబు పేర్కొన్నారు. చినవాల్తేర్, కె.డి.పి.యంం యం.వి.డి పాఠశాలల్లో రూ. 65 లక్షల వ్యయంతో స్మార్ట్ క్లాస్ రూమ్స్‌ను, సోలార్ రూఫ్ టాప్‌లను గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1.09 కోట్లతో మొదటి దశలో ఆరు పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా

తరువాయి 2లో




# చిరస్మరణీయులు బాబు జగ్జీవనరాం

## రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు



విశాఖపట్నం : చిరస్మరణీయులు బాబు జగ్జీవనరాం అని ద్రోణంరాజు అన్నారు.మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవనరాం 31వ వర్థంతి సందర్భంగా గురువారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు మాట్లాడుతూ జగ్జీవనరాం 40 ఏళ్లు కేంద్రంలో ఉపప్రధానిగా, కేంద్ర రక్షణ శాఖా మంత్రిగా, రైల్వే శాఖా మంత్రిగా, కార్మిక శాఖా మంత్రిగా అనేక పదవులు నిర్వహించారని అన్నారు. 27 సంవత్సరాల వయస్సులోనే బీహార్ శాసన మండలి సభ్యులుగా రాజకీయ జివితం ప్రారంభమైందని అన్నారు.

ఆయన నిర్వహించిన పదవులకే వన్నె తేచ్చి, అతి చిన్న వయస్సులోనే కేంద్రమంత్రి వర్గంలో చేరి బేబి మినిస్టర్‌గా పిలవబడి అతి తక్కువ కాలంలోనే పరిపాలనా దక్షత, ప్రజల పట్ల ఎన లేని ప్రేమ, నిస్వార్థసేవతో అసమాన ప్రతిభ కనబరిచి ఎన్నో ఘన విజయాలు సాధించి తిరుగులేని దేశ నాయకునిగా గుర్తింపు పొంది ప్రజల హృదయాలలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని అన్నారు.

ఆహారశాఖ మంత్రిగా హారిత విప్లవాన్ని సృష్టించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉడా మాజీ చైర్మన్ పి.ఎస్.ఎన్.రాజు (రవి) కాంగ్రెస్ నాయకులు ఎమ్ సత్యనారాయణరాజు, జగ్గపల్లి అప్పలరాజు, సేవాదళ్ ఛైర్మన్ పెంటపల్లి సత్యనారాయణ, బి.సి.సెల్ ఛైర్మన్ కొణతాల శ్రీనివాస్, జిల్లా ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడు కిరణ్ ప్రసాద్, బమ్మిడి గంగాధర్ తదితరులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిప్రదక్షణకు ఏర్పాట్లు పూర్తి



*గిరిప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న డిసిపి-1 రవికుమార్, డిసిపి-2 ఫకీరప్ప, ఏసీపీ భీమారావు, సీఐ వైకుంఠరావు, ట్రాఫిక్ సిఐ కాంతారావు, దేవస్థానం ఇఇ వెంకటేశ్వరరాజు, కోటేశ్వరరావు తదితరులు*

సింహాచలం : సింహాద్రినాధుని గిరిప్రదక్షణ శనివారం జరుగనుంది. ఇందుకు సంబందించి ఏర్పాట్లన్నీ పూర్తి కావచ్చాయని కార్యనిర్వాహణాధికారి కోడూరి అచ్చుత రామచంద్రమోహన్, ఏసిపి భీమారావు బృందం తెలిపారు. సింహాద్రినాధుని గిరిప్రదక్షణ సంబందించి స్వచ్ఛంద సేవా సంస్థలు, సంఘాల ప్రతినిదులతో గిరిప్రదక్షణ ఏర్పాట్లపై కార్యనిర్వాహణాధికారి కోడూరి రామచంద్రమోహన్ గురువారం కొండక్రింద ఉన్న 60గదుల సత్రం నృసింహ సదన్ లో సమావేశమయ్యారు. స్వామివారి గిరిప్రదక్షణ జూలై 8వ తేదీన అంటే శనివారం జరుగనుంది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు మంచినీటి ప్యాకెట్‌లు, మందులు(పెయిన్ కిల్లర్స్) అందజేయాలన్నారు. దేశంలో ఉన్న అన్ని పుణ్యక్షేత్రాల్లో గొప్పదైన సింహాచలం దేవస్థానం అని భక్తులు అంటున్నారని గుర్తుచేశారు. గిరిప్రదక్షణ మహోత్సవం ఆద్యాత్మికంగా సామాజిక మార్పు వచ్చిందని ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాల పట్ల ప్రజల్లో కనిపిస్తున్న భక్తీతో పాటు గౌరవ ప్రపత్తులు ప్రతిబింబించిన అద్భుత సంఘటన అన్నారు. అదేవిదంగా దారి పొడవునా భక్తులకు స్వచ్ఛంద సేవా సంస్థలు వారి వారి ఆర్థిక పరిస్థుతులకు అనుకూలంగా వివిధ రూపాలలో సేవలు చేయటం ప్రజల్లో ఐక్యతాభావాన్ని చాటి చెచెప్పేలా సేవలందించాలని కోరారు. అదేవిధంగా భక్తులకు తగినంత ప్రసాదాలు , అల్పాహారాలు అందించి ఆహార వృథా కాకుండా చూడమని హితవు పలికారు. సమావేశంలో దేవస్థానం సాంకేతిక విభాగం ఈఈలు వెంకటేశ్వర రాజు, కోటేశ్వరరావు డీఈ రమణ , సహాయ కార్యనిర్వాహణాధికారులు ఎంవికె ఆచార్యులు, రాఘవకుమార్, దుర్గారావు, ఏఈలు సూర్యనారాయణ, రాంబాబు, హరిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ సమాజము నూతన కార్యవర్గం



విశాఖపట్నం: డాబాగార్డెన్స్‌ల గల ప్రేమ సమాజమునకు 2017-19కు గాను ప్రేమ సమాజము జీవితకాల సభ్యుల నుండి 20 మందిని కార్యవర్గ సభ్యులుగాను ఎన్నుకోబడినదని ఈ 20మంది సభ్యుల నుండి ఒకరిని కోశాధికారి గాను ఇద్దరిని సంయుక్త కార్యదర్శులుగాను నియమించడమైనదని ఈ విలేకరుల సమావేశంలో మీకు తెలియపరుచుచున్నాము. ప్రేమ సమాజమునకు అధ్యక్షులుగా కంచర్ల రామబ్రహ్మం, ఉపాధ్యక్షులుగా బుద్ధ శివాజీ మరియు డా.పూసర్ల విశ్వేశ్వరరావు, కార్యదర్శిగా మట్టపల్లి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శులుగా కోన జగదీశ్వరరావు, శరగడం సత్యనారాయణ, జి.రాధాకృష్ణ, కోశాధికారిగా చల్లా వెంకటరావు, పిఆర్‌ఓగా యం.వి.రాజశేఖర్‌లు ఎన్నికైనారని తెలిపారు. వీరితో పాటు 20 మందిని ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రేమ సమాజము అధ్యక్షులు కంచర్ల రామబ్రహ్మం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులందరి సహకారంతో ప్రేమ సమాజము ఉన్నతికి కృషి చేయడమే కాకుండా ప్రేమ సమాజము శరణాలయంలో నివసిస్తున్న వారందరికి ఉపయోగపడే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

# వైభవంగా సాయి సచ్చరిత్ర పారాయణం

రావులపాలెం : రావులపాలెంలో వైభవంగా సాయి సచ్చరిత్ర సామూహిక పారాయణ మహోత్సవం నిర్వహించారు. స్థానిక ముసలి రామాలయ ప్రాంగణంలో షిర్డిసాయిబాబా వారి ఆలయంలో గురుపౌర్ణమి మహోత్సవం సందర్భముగా గురువారం షిరిడి సాయి సేవా సమితి, మంగళవారపు పేట రాజమండ్రి వార్ల అధ్వర్యంలో శ్రీ సాయి సచ్చరిత్ర సామూహిక పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.వి. సర్వేశ్వరరావు, సురేష్, మహతి, కోటేశ్వరరావు, అన్నపూర్ణ, లక్ష్మి, బాలకృష్ణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, చిన్నకెవి, కోటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

# కర్రి అప్పలస్వామి ప్యానల్ విజయంపై హర్షం



భీమునిపట్నం: తెలుగుదేశం పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి వర్యులు గంటా శ్రీనివాసరావు విడిది కార్యాలయంలో భీమిలి డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ సింహాచలంలో అడవివరం సహకార పరపతి సంఘం పాలకమండలి ఎన్నికల్లో అధ్యక్షునిగా కర్రి అప్పలస్వామి విజయం సాధించినందుకు భీమిలి డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంటా నూకరాజు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ వాళ్ళు ఎన్ని పన్నాగాలు పన్నినా తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి అడవివరం సహకార పరపతి సంఘం పాలకమండలి ఎన్నికల్లో కర్రి అప్పలస్వామి ప్యానల్ విజయం సాధించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపల్లి యోగి, దాసరి వెంకటేష్, మారోజు సంజీవ్, కె.ఎస్.ఆర్.కృష్ణారావు, డెక్కన్ శ్రీను, పోతురాజు, లక్ష్మణరావు, ఆదర్శ హిందీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# *116 వ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి శత జయంతి వేడుక*

రావులపాలెం : డా॥ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి దేశంకోసం తన జీవితాన్ని త్యాగంచేసారని, ఆయన గొప్ప ఆదర్శవంతమైన రాజకీయనాయకుడని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తమలంపూడి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక బిజెపి కార్యాలయంలో డా॥శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి 116వ శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిపారు. ముందుగా ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తమలంపూడి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండుజెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండరాదని కాశ్మీర్ వెళ్లడానికి అక్కడి ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనడం సిగ్గుచేటని, కాశ్మీరులో స్వతంత్ర్యంగా అడుగుపెట్టి, దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు, చిన్నం వెంకట సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి, జనిపిరెడ్డి తాతారావు, గంద్రోతు వీరగోవింరావు, పెన్మెత్స నరశింహరాజు, వీరభద్రరావు, విజయకుమార్, నరశింహమూర్తి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధితోనే దేశం సుభిక్షంగా ఉంటుంది

రావులపాలెం: మండల పరిధి పొడగట్లపల్లిలో గురువారం పార్లమెంటు సభ్యులు పండు రవీంద్రబాబు హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గోపాలపురం నుండి రావులపాడు వరకు తారు రోడ్డు వేయు పని 4.50 కోట్లతో, వినాయకపాలెంలో సిసి వంతెనకు 33 లక్షలతో, పంచాయితీ, ఉపాధిహామీ పథకం నిధులతో, 10 లక్షలతో శివాలయం వరకు సిసి రోడ్డు, 4.5 లక్షలతో గ్రామ రెవిన్యూ కార్యాలయం వంటివాటికి శంకుస్థాపనలు చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్‌పి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేకమంది నిరుద్యోగులు ఉన్నారని, కోనసీమ ప్రాంతంలో ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీ, పవర్ ప్లాంటు, స్టీలు ఫ్యాక్టరి వంటి నిర్మాణాలతో కోనసీమ ప్రాంతం అభివృద్ధి చెందిన ప్రతి యువతకు ఉద్యోగ అవకాశంతోపాటు దానికి అనుసందానంగా చిన్నచిన్న పారిశ్రామిక సంస్థలు ఏర్పాడే అవకాశం ఉందన్నారు. త్వరలోనే కోనసీమలో రైలు కూత వినిపించేలా చేస్తామని ఆయన తెలిపారు.

రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలని చెప్పిన మహాత్మాగాంది కలలు నెరవేర్చేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బండారు సత్యానందరావు మాట్లాడుతూ 17 కోట్లతో ఈతకోట-రాజవరం సిసి రోడ్డు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

## హైకోర్టులోనే తేల్చుకోండి : సుప్రీం

తరఫున న్యాయవాదులు న్యాయస్థా నానికి చెప్పారు. దీంతో ఆ క్షమాపణ లేఖను ఇప్పుడు ఇవ్వగలుగుతారా? అని రోజా న్యాయవాదులను సుప్రీంకోర్టు అడగగా.. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదికి ఈ రోజు న్యాయస్థానం సమక్షంలోనే లేఖ అందజేశారు. ఈ లేఖను సంబధిత శాఖలు, అధికారులకు పంపాలని ఈ సందర్భంగా న్యాయస్థానం ఆదేశించింది. హైకోర్టులో కేసు ముగిసిన తర్వాత మాత్రమే తాము విచారణకు స్వీకరిస్తామని మరోసారి స్పష్టం చేసింది.

## మహిళలపై ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు

చేసిన ఈ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.

మలయాళీ చిత్ర పరిశ్రమ గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు ఎంపీ ఇన్నోసెంట్ మాట్లాడుతూ.. మలయాళీ చిత్రపరిశ్రమ ప్రస్తుతం చాలా బాగుంది. ఇక్కడ కాస్టింగ్ కౌచ్ అనేదే లేదు. గతంలో లాంటి పరిస్థితులు మారాయి. ఇప్పుడు మహిళల పట్ల ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే అది వెంటనే మీడియాకు తెలిసిపోతుంది. కానీ.. మహిళలే చెడుగా ఉంటే వారు పక్కలోకి వెళ్లే అవకాశముంది అని సమాధానమిచ్చారు. ప్రసుతం ఇన్నోసెంట్ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.

2014లో సార్వత్రిక ఎన్నికల్లో వామపక్షాల మద్దతుతో ఇన్నోసెంట్ స్వతంత్ర ఎంపీగా గెలుపొందారు. మలయాళం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు కూడా ఆయన అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

## మొదటి ప్రపంచ యుద్ధవీరులకు మోదీ నివాళులు

మేజర్ దల్పాత్ సింగ్ జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇజ్రాయెల్ ఇద్దరు ప్రధానులు కలిసి హైఫాలోని డోర్ బీచ్‌కు వెళ్లారు. సముద్రపు నీటిలోకి దిగి కాసేపు నడుచుకుంటూ వారిద్దరూ మాట్లాడుకున్నారు. గురువారంతో ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసింది అనంతరం ఆయన జర్మనీ ప్రయాణంఅయ్యారు. అక్కడ జులై 7,8 తేదీల్లో జరిగే జీ 20 సదస్సులో పాల్గొంటారు.

## భారత్‌కు వ్యాపించిన థిలాపియా లేక్ వైరస్

ఉత్పత్తుల ఎగుమతులు అభివృద్ధి సంస్థ (ఎంపెడా) అధికారులు ప్రకటించారు. ఈ వైరస్ విషయంలో ఆక్వా రైతులను అప్రమత్తం చేయాలంటూ ఎంపెడా అధికారులను కేంద్రం ఆదేశించింది. ఇప్పటికే ఇజ్రాయిల్, లాటిన్ అమెరికా, ఈక్విడార్, కొలంబో దేశాల్లో 80 శాతం నష్టం జరిగినట్లు అధికారులు చెప్పారు. రాష్టంలో వేలాది ఎకరాల్లో ఉండగా పశ్చిమగోదావరి జిల్లాలో థిలాపియాను సుమారు 2 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. థిలాపియా మూడు రకాలు. ఇందులో బ్లాక్ థిలాపియా పూర్వం నుంచి కొల్లేరులో లభ్యమయ్యేది. దీనికి పెద్దగా విలువ లేకపోవడంతో అమెరికాకు చెందిన రెడ్‌థిలాపియా రకాన్ని దిగుమతి చేసుకుని సాగు ప్రారంభించారు. కొంత కాలం కిందట ఎంపెడా ఫిలిఫైన్స్ నుంచి గ్రేథిలాపియా రకాన్ని దిగుమతి చేసుకుని వాటి పిల్లల్ని ఉత్పత్తి చేసే కేంద్రం (హేచరీ) కృష్ణా జిల్లా కంకిపాడులో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ చేపలకు మంచి డిమాండ్ ఉండటంతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసే దిశగా ఎంపెడా కృషి చేస్తోంది.

లక్షణాలు ఇవీ..

థిలాపియా చేపలపై పుండ్లు పడతాయి. మొప్పలు, పొలుసులు వూడిపోతాయి. సాధారణంగా ఎర్రగా ఉండే చేప కళ్లు తెల్లగా మారిపోతాయి. మేత తినడం బాగా తగ్గిపోతుంది. కదలికలు తగ్గిపోయి చేపలు చెరువు అడుగు భాగంలోకి చేరతాయి. ఈ లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే చేపల నమూనాలను స్థానిక ఎంపెడా కార్యాలయాలకు తీసుకెళ్లాలని భీమవరం ఎంపెడా ఏడీ డాక్టర్ పి.శ్రీనివాసులు సూచించారు. వాటిని తమిళనాడులోని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్‌కు పరీక్షలకు పంపిస్తామన్నారు.

## బెట్టు చేస్తున్న చైనా

నేపథ్యంలో చైనా అధికారి గురువారం మాట్లాడుతూ అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మధ్య ద్వైపాక్షిక సమావేశానికి వాతావరణం సరిగా లేదని చెప్పారు. సిక్కిం సెక్టర్‌లోని డోకలామ్ ప్రాంతంలో రోడ్డును నిర్మించేందుకు చైనా సైన్యానికి చెందిన ఓ బృందం ప్రయత్నించింది. భారత్-చైనా-భూటాన్ ట్రై జంక్షన్ వద్ద ఈ నిర్మాణానికి ప్రయత్నించింది. దీంతో 20 రోజుల నుంచి భారత్-చైనా మధ్య ప్రతిష్టంభన నెలకొంది. ఈ ప్రాంతాన్ని భారతదేశం డోక లా అని, భూటాన్ డోకలామ్ అని పిలుస్తాయి. అయితే ఇది డోంగ్‌లాంగ్ ప్రాంతంలో భాగమని చైనా చెప్పుకుంటోంది. భారతదేశం ఓ ప్రకటనలో భూటాన్‌కు చెందిన ఈ ప్రాంతం నుంచి వైదొలగాలని చైనాను కోరింది.

## రైతు ఆత్మహత్యలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ముందు అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు. సిటిజెన్స్ రిసోర్స్ అండ్ యాక్షన్ ఇనీషియేటివ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం రైతుల ఆత్మహత్యల సమస్యను రాత్రికి రాత్రే పరిష్కరించడం సాధ్యం కాదని అభిప్రాయపడుతున్నట్లు పేర్కొంది. ఫలితాల కోసం గడువును కోరడం సమర్థనీయమేనని తెలిపింది. కేంద్ర ప్రభుత్వానికి సమయం ఇస్తున్నట్లు చెప్తూ, ఆరు నెలల తర్వాత తదుపరి విచారణను జరుపుతామని తెలిపింది.

అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వం తరపున వినిపించిన వాదనలలో ప్రభుత్వం రైతులకు అనుకూలంగా కొన్ని చర్యలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకాలు సత్ఫలితాలు ఇవ్వాలంటే తమకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. దేశంలో 12 కోట్ల మంది రైతులు ఉన్నారని, వీరిలో 5.34 కోట్ల మందిని ఇప్పటికే ఫసల్ బీమా యోజన వంటి సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. అంతేకాకుండా 30 శాతం సాగు భూమిని పంటల బీమా పథకం క్రిందకు తీసుకొచ్చామని, ఈ విస్తీర్ణం 2018నాటికి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

## అధునాతన పద్ధతిలో విద్యాబోధనకు డిజిటల్ తరగతులు



విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దడానికి అన్ని హంగులు అమర్చుతున్నట్లు వివరించారు.

విశాఖ దక్షిణ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠశా లల ప్రధానోపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం చేస్తున్న కృషి, అందజేస్తున్న సౌకర్యాలను గురించి వివరించడం ద్వారా తల్లిదండ్రులలో ఆత్మ విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. జివియంసి కమిషనర్ హరినారాయణన్ కార్యక్రమాలకు అధ్యక్షతవహిస్తూ జివియంసిలో నిర్వర్తిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు.



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. రూ.5.9 కోట్లతో రెండవ దశలో 25 ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూంలు ప్రారంభించడానికి చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. రూ.3 కోట్లతో 124 పాఠశాలల్లో సోలార్ పవర్‌ను ప్రారంభించడానికి జివియంసి కమిషనర్ హరినారాయణన్ కార్యాచరణ ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ / మున్సిపల్ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలల స్థాయికి తీసుకువచ్చే విధంగా విద్యాబోధన, ఫలితాలుండాలని ప్రతి విద్యార్థి ఉత్తమంగా రూపొందేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామక్రిష్ణబాబు మాట్లాడుతూ జివియంసికి చెందిన అన్ని పాఠశాలలను రూ.7 కోట్లతో మరమ్మత్తులు, రంగులు వేసి అందంగా తీర్చిదిద్దిన కమిషనర్‌ను అభినందించారు. స్మార్ట్ తరగతులు నిర్వహించ డానికి స్మార్ట్ భవనాలుగా రూపొందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



అనంతరం సోలార్ రూఫ్ టాఫ్‌లను, స్మార్ట్ క్లాస్ రూంలను పార్లమెంటు సభ్యులు డా.కె.హరిబాబు, శాసనసభ్యులు వి.రామక్రిష్ణబాబు, వాసుపల్లి గణేష్ కుమార్ లు ప్రారంభించారు.

కార్యక్రమంలో యస్.ఇ వెంకటేశ్వర రావు, ఇ.ఇలు వెంకటి, సుధాకర్, జోనల్ కమిషనర్లు పి.నల్లనయ్య, వి.చక్రధరరావు, డిప్యూటి డి.ఇ.ఓ సి.ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు క్రిష్ణవేణి, నాయుడు అయికాం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 70వ వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు

## - కమిషనర్ హరినారాయణన్

- సూర్యతేజనగర్, ఎన్.ఏ.డి లే అవుట్, శతాబ్దినగర్‌లలో పర్యటన
- సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు సందర్శన
- గొల్లలపాలెం ప్రాంతాలలో సమస్యలపై పరిష్కారం



విశాఖపట్నం : జివియంసి పరిధిలోని 4వ జోన్ కు చెందిన 70వ వార్డులోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నట్లు కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం సూర్యతేజనగర్, ఎన్.ఏ.డి లే అవుట్, శతాబ్ది నగర్ లలో పర్యటించి స్థానికుల సమస్యలను విన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువలు, రహదారుల సమస్యల పరిష్కారానికి పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు పై సెంట్రల్ మీడియన్ ఏర్పాటును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలను రోడ్డు ప్రక్కకి ఏర్పాటు చేయాల్సింఇగా ట్రాన్స్‌కో సిబ్బందిని ఆదేశించాలని జోనల్ కమిషనర్ ఎన్.శివాజీని ఆదేశించారు. రహదారుల మార్జిన్స్‌లోని పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు.

ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని రోడ్లపై, పరిసరాలలో లేకుండా పరిశుభ్రం చేయాలని పేర్కొన్నారు. పర్యటనలో యస్.ఇ వేణుగోపాల్, జోనల్ కమిషనర్ ఎన్.శివాజీ, ఏ.యం.ఓ.హెచ్ ప్రసాద్, ఏసిపి రామలింగం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బండారుకు మతి భ్రమించిందా

## అన్నంరెడ్డి అధీప్‌రాజు



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న అన్నంరెడ్డి అధీప్‌రాజు

సబ్బవరం: గౌరవ శాసన సభ్యులు రోజాపై బండారు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకొనే విధంగా వున్నాయని అన్నంరెడ్డి అధీప్ రాజు అన్నారు. మండల కేంద్రంలో గురువారం వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అన్నంరెడ్డి అధీప్ రాజు పాల్గొని మాట్లా డారు. గౌరవ శాసనసభ్యులు రోజాపై పెందుర్తి ఎమ్మెల్యే బండారు చేసిన వ్యాఖ్యలు అనుచితమని సభ్య సమాజం తలదించుకునే విధంగా వున్నాయని అన్నారు. ప్రభుత్వ పాత శాలలను సైతం పార్టీ కార్యాలయం కింద మార్చి మీడియా సమావేశాలు నిర్వహించడం దారుణమన్నారు. నియోజకవర్గంలో సమస్యలను పక్కన పెట్టి వైకా సభ్యులను విమర్శించడం పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై వైకా పార్టీ నిలదీసినందుకు ఒక ఎమ్మెల్యేగా బాధ్యతాయుతంగా ప్రవర్తించక ఒక రౌడీలాగా ప్రవర్తిస్తున్నా రన్నారు. ముదపాక భూముల విషయంపై తనకు సంబంధం లేదని చెబుతున్న బండారు రైతుల పక్షాల నిలబడి ఎందుకు పోరాడటములేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, వనం అచ్చింనాయుడు, మోపాడ అప్పారావు, తుంపాల అప్పారావు, కేశవరావు, పరవాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిఢమిల్లాలి

## మహిళా వసతిగృహంలో మొక్కలు నాటిన వీసీ



మొక్కలు నాటుతున్న వీసీ నాగేశ్వర రావు తదితరులు

విశాఖపట్నం : విశ్వవిద్యాలయం పరిసరాలు పచ్చదనంతో పరిఢమిల్లాలని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం ఏయూ విద్యార్థినుల వసతిగృహంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పరిసరాలను పూర్తిస్థాయిలో పచ్చదనంతో నింపే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఆచార్యులు, విద్యార్థులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ పూర్తిస్థాయిలో మొక్కలను పెంచడానికి కృషిచేయాలన్నారు.

కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ పి.సునీత, డీన్ ఆచార్య డి.పుల్లారావు, వసతిగృహం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం హాస్టల్ ప్రాంగణంలో కొబ్బరి, ఉసిరి తదితర జాతుల మొక్కలను నాటారు.

# గీతం 'వర్సిటి ఎమ్‌బిబిఎస్ అడ్మిషన్లు

విశాఖపట్నం : గీతం విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్య కళాశాలలో 2017-18 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరం ఎమ్‌బిబిఎస్ అడ్మిషన్లు జాతీయ స్థాయిలో డైరక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్‌ఎస్) నిర్ణయించిన కౌన్సిలింగ్ తేదీల ప్రకారం జరగనున్నాయని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు తెలిపారు. జిమ్‌సర్ వైద్య కళాశాలలో ఎమ్‌బిబిఎస్ కోర్సులో ప్రవేశం పొందగోరే విద్యార్థులు తమ వివరాలను www.mcc.nic.in వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయి అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కౌన్సెలింగ్ విభాగంలో డీమ్డ్ యూనివర్సిటిల కేటగిరి లో గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (కళాశాల కోడ్ - ఎపి01) ను ఎంపిక చేసుకోవలసి ఉంటుందని సూచించారు. విద్యార్థులు కళాశాల ఎంపిక తదితర వివరాలను ఆన్‌లైన్ ద్వారా రిజిష్టర్ చేసుకోవడానికి జులై 11వ తేది వరకు అనుమతిస్తారని పేర్కొన్నారు. గీతం విశ్వవిద్యాలయం ఎమ్‌బిబిఎస్ ప్రవేశాలు జాతీయ స్థాయిలో డిజిహెచ్‌ఎస్ నియమ నిబంధనలకు లోబడి జరుగుతాయన్నారు. మరింత సమాచారం కోసం గీతం విశ్వవిద్యాలయం http://gimsr.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా సూచించారు.

### జూలై 11 లోగా జివియంసిలో ఆశా కార్యకర్తల భర్తీకి

# దరఖాస్తు చేయాలి

విశాఖపట్నం : జివియంసి పరిధిలోని స్లమ్ ఏరియాలో ఆశా కార్యకర్తల ఖాళీలను భర్తీ చేయుటకు జూలై 11 వ తేది చివరి తేదిగా కమిషనర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల మహిళా అభ్యర్థులు దరఖాస్తులను వారికి దగ్గరలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం లేదా ఇ-పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందజేయాలని కోరారు. గడువు ముగిసిన తరువాత అనగా జూలై 11 వ తేది తరువాత అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరించబడవని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఆగష్టు మొదటి వారంలో ముద్రా రుణాల మేళా నిర్వహించండి

- కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : బ్యాంకర్లు జివియంసి పరిధిలోని పేదలకు ఋణ సౌకర్యం కల్పించి దారిద్ర్యరేఖనుండి పైకి తీసుకువచ్చేలా చూడాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో యస్.సి కార్పొరేషన్, యస్.టి కార్పొరేషన్, ఎల్.డి.యం. బ్యాంక్ మేనేజర్లు, జోనల్ కమిషనర్లతో గురువారం ఆయన సమావేశమైనారు. ఈ సందర్భమగా యుసిడి ప్రాజెక్టు డైరక్టర్ డి.శ్రీనివాసన్ లోన్స్ దరఖాస్తులు, మంజూరు గురించి వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ జివియంసి పరిధిలో 1000 మందితో ముద్రా రుణాలు మంజూరు కోసం రుణమేళా నిర్వహించాలని ఆదేశించారు.సమావేశంలో ఎల్.డి.యం.శరత్ బాబు, ఇ.డి.యస్.సి కార్పొరేషన్ మహలక్ష్మి, బిసి కార్పొరేషన్ ఇ.డి మురళి, జోనల్ కమిషనర్లు సత్యవేణి, పి.నల్లనయ్య, వి.చక్రధర రావు, యస్.రమణ మూర్తి, సోమన్నారాయణ, ఎన్.శివాజీ, సన్యాసినాయుడు, ఏపిడిలు తదితరులు హాజరైనారు.

## ఈనెల 8, 9 తేదీల్లో బాస్కెట్‌బాల్ పోటీలు

విజయవాడ : స్థానిక బి-క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని బాస్కెట్‌బాల్ ఎరీనాలో 8, 9 తేదీల్లో పాఠశాల స్థాయి అండర్-14, అండర్-17 విభాగాల్లో బి-క్యాంపు బాస్కెట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ నాయకులు సంపత్‌కుమార్, వాసుదేవరావులు తెలిపారు.

# ప్రకృతి రమణీయతను చూపిన సాక్షి చిత్రం

## జర్నలిజం విభాగంలో చిత్ర ప్రదర్శన



ప్రసంగిస్తున్న ఆచార్య పి.బాబి వర్ధన్

విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగంలో సాక్షి చలన చిత్రాన్ని ప్రదర్శించారు. ఏయూ జర్నలిజం విభాగం, వైజాగ్ ఫిలిం సొసైటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. అనంతరం చిత్రంపై సమీక్ష జరిపారు. జర్నలిజం విభాగ బిఓఎస్ చైర్మన్ ఆచార్య పి.బాబి వర్ధన్ మాట్లాడుతూ ప్రకృతి రమణీయతను చాటిని చిత్రంగా సాక్షి నిలుస్తుందన్నారు. గోదావరి తీరాన్ని తెరపై అద్భుతంగా చూపారన్నారు.

తెలుగు చిత్ర సామర్థ్యాన్ని జాతీయ స్థాయిలో చూపిన ఘనత బాబు, రమణలకు దక్కుతుందన్నారు.

కార్య క్రమంలో విభాగాధిపతి ఆచార్య చల్లా రామక్రిష్ణ, విదేశీ భాష అధ్యయన విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, వివిఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, పి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.



**అడివివరం కో ఆపరేట్ బ్యాంక్ ఎలక్షన్స్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో 66వ వార్డు అధ్యక్షుడు గేదల మురళీకృష్ణ 68వ వార్డు అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాస్ రావు అత్యధిక మెజారిటీతో గెలుపొందారు.**

**ఈప్రపంచంలో ప్రతిదానికి ఒక ఎక్స్‌పైర్ ఉంటుంది. ఒక్క బెహరా భాస్కర రావు గారి క్రేజ్ కితప్ప,ఎంత మంది ఉన్న ఎంత మంది ఒచ్చిన మీకు మీరే పోటి... మీకు మీరే సాటి సర్...!!!**

**జై బెహరా!**

# జివియంసి కాంట్రాక్ట్ కార్మికులు విజయోత్సవ ర్యాలీ




విశాఖపట్నం : సిఐటియు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ రంగంలో చేస్తున్న పోరాటాలు ఎప్పుడు వృదా కాలేదు. కొన్ని శక్తులు పిఆర్‌సి వేతనమైన రూ.13,000/-లు అమలు కాకుండా రూ.11,000/-లకే అమోదించి కార్మికులకు ద్రోహంచేసినా సరే సిఐటియు యూనియన్ ముగ్గురు మంత్రులకు పెట్టిన షరతుల ప్రకారమే 2సం॥ల తరువాత 151 జీఓ ప్రకారంగా పారిశుధ్యం, నీటిసరఫరా ఇతర అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.12,000/-లు, డ్రైవర్లకు అలాగే నీటిసరఫరా, ఇంజనీరింగ్, హెల్త్ అసిస్టెంట్‌లు, అవుట్‌సోర్సింగ్ మేస్త్రీలు తదితర సెమిస్కిల్డ్ కార్మికులకు రూ.15,000/-లు మరియు స్కిల్డ్ కార్మికులకు రూ.17,500/-లు అమలు చేయడానికి మున్సిపల్ డైరక్టర్ శ్రీ కె.కన్నబాబుగారు ఉత్తర్వులు జారీచేయడమైనది.ఈ జీఓ వలన జివియంసిలో 6800మంది కార్మికులు లబ్ధిపొందుతారు. పోరాడి సాధించుకున్న మున్సిపల్ కార్మికులకు సిఐటియు జేజేలు పలుకుతోంది. ప్రభుత్వానికి కూడా ధన్యవాదాలు తెలుపుతున్నాం. జివియంసి కమీషనర్ గారు 151 జీఓ తేది నుండి వేతనాలను వెంటనే అమలు చేయాలని నిన్ననే శ్రీ కమీషనర్ గారికి మెమొరాండం ఇవ్వడమైంది. "విజయోత్సవ ర్యాలీ గాంధీ విగ్రహం నుండి జివియంసి మెయిన్ ఆఫీస్ వరకు వచ్చిన తదనంతరం విజయోత్సవ సభకు యూనియన్ అధ్యక్షులు జి.సుబ్బారావు గారు అధ్యక్షత వహించారు. తదనంతరం మాట్లాడుతూ 151జీఓ ప్రకారం వేతనాలు, ఏరియర్స్‌తో పాటు అమలుచేయాలని కమీషనర్ కోరామ న్నారు. అలాగే సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ గారు మాట్లాడుతూ సమానపనికి - సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికుల కడుపులు కొట్టే 279జీఓ వెంటనే రద్దు చేయాలని లేనియెడల పారిశుధ్య కార్మికులంతా సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గౌ॥అధ్యక్షులు పి.వెంకటరెడ్డి గారు మాట్లాడుతూ రూ.600/-ల జీతం నుండి పోరాడి ఈ రోజు రూ.12,000/-ల వరకు సాధించామని, కార్మికుల పోరాట ఫలితంగానే ఈ జీఓ వచ్చింది తప్ప ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతో రాలేదన్నారు.

టిడిపి నాయకులకు పారిశుధ్య కార్మికులపై ఏమాత్రం జాలీ,దయ ఉంటే వారిపొట్టలు కొట్టే 279జీఓ రద్దుచేయటంకోసం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు తెలియపరచి జీఓ రద్దు అయ్యేటట్లు చేయాలని లేని ఎడల 500నగరాలలో 3వర్యాంకును తీసుకువచ్చిన విశాఖనగరాన్ని అపరిశుభ్రంగా మార్చి విశాఖ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని అందుకు పూర్తి బాధ్యత తెలుగుదేశం నాయకులే వహించవలసి ఉంటుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.నూకరాజు, ఉపాధ్యక్షులు శీర రమణ, కార్యదర్శి యు.రాజు, నాయుడు, అప్పలరాజు, రాము తదితరులు మరియు అత్యధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



*విజయవాడలో టోయోటో డ్రైవింగ్ స్కూల్ ను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు*



# విజయభాను సంపాదకీయం

## సమతుల్యతను కాపాడుకోవాలి

భారత్ విధానం అనుకూలంగా లేనప్పటికీ ఇజ్రాయెల్ పరిస్థితిని అర్థం చేసుకున్నదే తప్ప ద్వేష భావన పెంచుకోలేదు. కాలం కలిసివచ్చే వరకు ఎదురు చూసింది. భారత్ ఎప్పటికైనా తమవైపు వస్తుందనే ధోరణితో వ్యవహరించింది. భారత్‌కు ఎప్పుడు అపద వచ్చినా ఆదుకున్నది. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు ఆయుధాలు సరఫరా చేసింది. బంగ్లాయుద్ధ సమయంలో రహస్యంగా ఆయుధ సామాగ్రి అందజేసింది. కార్గిల్ ఘర్షణ సందర్భంగా కూడా తోడ్పడింది. డెబ్బయి ఏండ్ల పాటు పరిస్థితుల వల్ల అంటీముట్టనట్టు ఉన్నా, లోపాయికారిగా రెండు దేశాల నాయకత్వాల మధ్య సదవగాహన కొనసాగింది.

ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీకి ఊహించినరీతిలోనే ఘన స్వాగతం లభించింది. చాలాకాలం తరువాత దగ్గరి చుట్టం వస్తే కనిపించే సంబురం ఆ దేశంలో వ్యక్తమైంది. ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతాన్యహు లాంఛనాలను పక్కనపెట్టి పోప్‌ను, అమెరికా అధ్యక్షుడిని ఆహ్వానించే మాదిరిగా మోదీని కూడా విమానాశ్రయానికి వెళ్ళి స్వాగతం పలికారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసి, ప్రపంచీకరణ ప్రారంభమైన తరువాత భారత్ అమెరికా శిబిరం వైపు అడుగులు వేస్తున్న క్రమంలో ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో అడుగుపెట్టారు. ఇజ్రాయెల్ దేశం స్థాపించుకున్న నాటినుంచి భారత ప్రధాని ఆ దేశానికి వెళ్ళడం ఇదే మొదటిసారి. అరబ్బు దేశాలతో సత్సంబంధాలు, ఇజ్రాయెల్‌తో దోస్తీ అనే రెండు అంశాలను విడదీసి చూడాలని వైఖరికి రావడానికి భారత్‌కు చాలాకాలం పట్టింది. 1992లో ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు నెలకొల్పుకున్న నాటినుంచి అరబ్బు దేశాలను నొప్పించకుండా భారత ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించింది. భారీ ప్రచారం లేకుండానే ఇజ్రాయెల్‌తో రక్షణ సామాగ్రి కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకున్నది. ఇప్పుడు ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఇతర రంగాలలో సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి ఏడు ఒప్పందాలు కుదిరాయి. అంతరిక్ష రంగానికి సంబంధించి మూడు ఒప్పందాలు కుదిరాయి. సాంకేతిక పరిశోధనలు, మంచినీరు, పారిశుద్ధ్యం, వ్యవసాయ రంగాలలో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య గాఢానుబంధానికి ఈ పర్యటన తొలి అడుగు మాత్రమే.

భారతీయులకు, యూదులకు మధ్య చారిత్రక వైషమ్యం ఏమీ లేదు. పైగా యూదులకు అటు యూరప్‌లోనూ, ఇటు ఇస్లామిక్ దేశాలలోనూ చేదు అనుభవాలున్నాయి. ఇతర సమాజాలలో ఇక్కట్లపాలైన యూదులు భారత దేశంలో ఆశ్రయం పొందారు. భారతీయ సమాజం వారి పట్ల ఎటువంటి వివక్ష చూపకుండా అక్కున చేర్చుకున్నది. ఈ విషయాన్ని ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా గుర్తుచేసుకున్నారు. యూరప్‌లో యూదులు అనుభవించిన బాధల పట్ల నెహ్రూ సానుభూతి చూపించారు. యూదుల పోరాడిన ఇజ్రాయెల్ స్థాపకుడు, మొదటి ప్రధాని డేవి డ్ బెన్ గురియన్ ప్రధాని నెహ్రూకు మంచి మిత్రుడు. అయినప్పటికీ 1948లో ఇజ్రాయెల్ ఏర్పడిన తరువాత రెండేండ్లకుగాని ఆ దేశాన్ని భారత్ గుర్తించలేదు. రెండు దేశాల మధ్య అనేక సారూప్యాలు ఉన్నప్పటికీ ప్రపంచ రాజకీయ పోకడలు రెండింటి మధ్య విభజన రేఖ ను గీసిపెట్టాయి. అప్పుడే స్వాతంత్ర్యం పొందుతున్న ఆసియా, ఆఫ్రికా దేశాలకు దిక్సూచిగా ఉన్న భారత్ తమ వైపు ఉండాలని ఇజ్రాయెల్ కోరుకున్నది. ఐన్‌స్టీన్ వంటి పెద్ద మనుషులు ఒప్పించడానికి ప్రయత్నించినప్పటికీ, భారత్ ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు పెట్టుకోలేదు. యూదుల కష్టాలు తీరవలసిందే, అది పాలస్తీనీయుల దుఃఖానికి దారి తీయకూడదనే నైతిక విధానానికి నెహ్రూ కట్టుబడి ఉన్నారు. అరబ్బు దేశాలతో సంబంధాలు చెడవద్దనే వాస్తవిక దృక్పథం కూడా నెహ్రూ విధానాన్ని ప్రభావితం చేసింది.

ఇందిరాగాంధీ హయాం లో భారత్ పూర్తిగా సోవియెట్ శిబిరం వైపుగా మొగ్గడంతో ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలు నెలకొల్పుకోవడానికి అవకాశమే లేకపోయింది. భారత కార్మికులు అనేకమంది అరబ్బు దేశాలలో జీవనోపాధి పొందడం, ఇంధన వనరుల కోసం ఆ దేశాలపై ఆధారపడవలసి రావడం కూడా ఇజ్రాయెల్‌ను దూరం పెట్టడానికి కారణం. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసే వరకు ఇదే విధానం కొనసాగింది.

నైతికంగా ఆలోచిస్తే ఇజ్రాయెల్‌తో దోస్తీ బలపడినప్పటికీ, పాలస్తీనా ప్రజలకు అన్యాయం జరుగకూడదనే నైతిక సూత్రానికి ఇప్పటికీ భారత్ కట్టుబడే ఉన్నది.

ఇజ్రాయెల్‌తో అనుబంధాన్ని మన అభివృద్ధికి ఉపయోగించుకోవడంతో పాటు, దౌత్య రంగంలో సమ తుల్యతను కూడా కాపాడుకోవాలె.

# పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

### శాసన మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం

రావులపాలెం : రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా రాజీ లేకుండా గ్రామాభివృద్దే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని శాసన మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. రావులపాలెం మండలం, లక్ష్మీపోలవరంలో సర్పంచ్ కడలి లచ్చన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 4.50 లక్షలతో నిర్మించ తలపెట్టిన గ్రామ రెవిన్యూ కార్యాలయం శంఖుస్థాపన కార్యక్రమంలో గురువారం పాల్గొన్న ఆయన 15 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డుతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను రెవిన్యూ కార్యాలయాలు నిర్మించడం ద్వారా ప్రజలకు రెవిన్యూ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతి గ్రామాన్ని అంచెలంచెలుగా సమన్వయంతో అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. 14 వ పంచవర్ష ప్రణాళిక సంఘం నిధులు నేరుగా పంచాయితీలకే రావడంతో వాటికి ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నిధులను మిళితం చేసి గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయమని, మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసింది చంద్రబాబే అని కొనియాడారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న పార్లమెంటు సభ్యులు పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ ఎమ్‌పి నిధులతో బిసిలకు ఫంక్షను హాలు నిర్మాణానికి హామీ ఇచ్చారు. రాష్ట్రం 16 వేల పైచిలుకు లోటు బడ్జెట్‌లో ఉన్నా రైతులకు ఋణ మాఫీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. రైతు ఋణమాఫీ మాదిరిగా డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ మాణ్యం పథకం ద్వారా 10 వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గ్రామగ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు జరపాలనే ప్రభుత్వ నిర్ణయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిటిసి మద్దుల నాగమణి, ఉప సర్పంచ్ మద్దుల సతీష్, బండారు వెంకట సత్తిబాబు, గుత్తుల పట్టాభిరామారావు, కుడుపూడి శ్రీనివాస్, జక్కంపూడి వెంకటస్వామి, పెచ్చెట్టి చిన్నారావు, మైగాపుల గురవయ్యనాయుడు, సయ్యపరాజు జనార్ధనరాజు, అత్తిలి వెంకటేశ్వరరావు, తహశీల్దారు సిహెచ్ ఉదయ భాస్కర్, ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు, విఆర్‌ఓ రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ సాంక్రమిక వ్యాధుల దినోత్సవం

రావులపాలెం : స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలనందు డా॥ పి. నాగమణి ఆధ్వర్యంలో సాంక్రమిక వ్యాధుల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ సాంక్రమిక వ్యాధులు మూగజీవుల నుండి మనుషులకు, మనుషుల నుండి పశుపక్షాదులకు వ్యాపిస్తాయని అన్నారు. ఈ వ్యాధులలో అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకరమైన వ్యాధి రేబిస్ వ్యాధి. ఈ వ్యాధి పిచ్చికుక్క కరవడం వల్ల పిచ్చికుక్క నోటినుండి వచ్చే లాలాజలం వల్ల ఈ వ్యాధి ప్రబలుతుందని అన్నారు. సాదారణంగా పిచ్చికుక్క కరచిన 14 రోజులనుండి 6 నెలలలోపు ఎప్పుడైనా ర్యాబిస్ వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సందర్భముగా గురువారం 55 కుక్కలకు ర్యాబిస్ వ్యాది టీకాలు ఉచితంగా వేసామని ఆమె తెలిపారు.

# క్రీడా మైదానాలకు నిధులు మంజూరు

రావులపాలెం : రావులపాలెం జెడ్‌పి బాలికోన్నత పాఠశాల, దేవరపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో ఆట స్థలములలో కోర్టులు నిర్మించేందుకు ఒక్కొక్క కోర్టుకు 2.30 లక్షలు ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు తెలిపారు. అలాగే గోపాలపురం, దేవరపల్లి గ్రామాల్లో శ్మసాన వాటిక అభివృద్ధి పనులకు ఒక్కొక్కటికి 5.5 లక్షలు ఉపాధి హామీ నిధులతో మంజూరైనవని ఆయన తెలిపారు.

# ప్రణాళికబద్ధమైన నగరమే లక్ష్యం

కాకినాడ : గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ పరిధిలో ప్రజలకు భారంలేని ప్రణాళికబద్ధమైన నగరీకరణే లక్ష్యమని గుడా చైర్మన్ గన్ని కృష్ణ స్పష్టం చేసారు. గురువారం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ హాలులో గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ రెండోవ బోర్డు మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన గుడా చైర్మన్ గన్ని కృష్ణ మాట్లాడుతూ ప్రజలకు భారంలేని రీతిలో స్క్రూటిని ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీల విధానాన్ని ఆన్‌లైన్ ప్రక్రియలో అమలు చేయనున్నామన్నారు. అభివృద్ధి అవసరాలకనుగుణంగా ప్రణాళికాబద్ధమైన నగరీకరణ లక్ష్యంగా గుడా సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ లక్ష్యసాధనకు గుడా బోర్డు అంకితభావంతో కృషి చేస్తుందన్నారు. ప్రారంభంలో చిన్నచిన్న సమస్యలు అడ్డంకులు ఎదురౌవతాయనీ, వాటిని అధిగమించి రాష్ట్రంలో ఆదర్శవంతమైన అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీగా గుడాను తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో ముందుగా మే 16న జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన బోర్డు మొదటి సమావేశంలో చర్చించిన అంశాలను, వాటిపై తీసుకున్న చర్యలను సమీక్షించారు. అనంతరం చేపట్టిన అంజెడాలో తొలుత గుడా అధికార చిహ్నం(లోగో) ఖరారు అంశాన్ని చర్చించారు. రాష్ట్రంలోని ఇతర అర్బన్ అధారిటీల లోగోలు, గుడా ప్రాంత భౌగోళిక సామాజిక పారిశ్రామిక అంశాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన నాలుగు రకాల లోగోలను పరిశీలించి చిన్న చిన్న మార్పులతో లోగో నమూనాను ఖరారు చేసారు. ఈ లోగోను రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే నెలలో రాజమహేంద్రవరంలో జరపనున్న పర్యటన సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని చైర్మన్ తెలిపారు. రెండోవ అంశంగా కాకినాడ కార్పొరేషన్ డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. ప్రజల సూచనలు, అభ్యంతరాలను సేకరించి, గుడా ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వం తుది ఆమోదానికి పంపాలని బోర్డు నిర్ణయించింది. మూడవ అంశంగా గుడా ప్రధాన ఆదాయ వనరులైన అప్రూవల్ రుసుంలు, అభివృద్ధి చార్జీల రేట్ల నిర్ణయాన్ని బోర్డు విస్తృతంగా చర్చించింది. 2007 నుండి అమలులో ఉన్న రేట్లను పరిగణిస్తూ రూపొందించిన మూడు పట్టికలలో అతి తక్కువ రేట్లను గుడా పరిధిలో అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఈ చెల్లింపు విధానాన్ని పారదర్శకమైన ఆన్‌లైన్ వ్యవస్థలోకి తెస్తామని గుడా వైస్ చైర్మన్ వి.విజయరామరాజు తెలిపారు. 4వ అంశంగా గుడా కార్యాలయం ఏర్పాటుకు కాకినాడ నగరంలో ప్రైవేటు భవనాల ప్రతిపాదనలను పరిశీలించి వీటిలో కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన వసతులు ఉన్న రెండు భవనాలను గుర్తించారు. వీటిలో కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఖరారు చేయాలని నిర్ణయించారు.

5వ అంశంగా ప్రతి లే అవుట్‌లో 10శాతం లాండ్ విధిగా బోర్డు తనఖాలో ఉంచాలనే నిబంధన వీటిలో పొందుపరిచారు. చట్టప్రకారం ఉండవలసిన పబ్లిక్ యుటిలిటీ ప్రాంతాలను లే అవుట్‌లలో తప్పనిసరిగా డవలపర్స్ పాటించేలా పటిష్టమైన నిర్ధేశాలను చేసారు. అలాగే గుడా పరిధిలో పాటించవలసిన బిల్డింగ్ రూల్స్‌ను కూడా బోర్డు చర్చించి క్రోడీకరించింది.

ఈ సమావేశంలో గుడా బోర్డు సభ్యులు గట్టి సత్యనారాయణ, పివివి ఎస్ రవీంద్రకుమార్, ఎలిశెట్టి చిన నారాయణ, కాకినాడ మున్సిపల్ కమిషనర్ అలీం భాషా, డిపిఓ టివిఎస్‌జి కుమార్, పరిశ్రమల కేంద్రం జిఎం పటేల్, గుడా కార్యదర్శి పిఎస్‌ఎస్ సాయిబాబా, ప్లానింగ్ ఆఫీసర్ కె.సంజయ్ రత్నకుమార్, ఎపిఓ సత్యమూర్తి, జెపిఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### 'సంస్కరించుకుందాం'

అంకితభావం... త్యాగనిరతి... సేవా ధృక్పథం లాంటి
ఆదర్శభావ లక్షణాల ఆనవాళ్లు అంతరించి పోతుంటే...
అవినీతి... ఉన్మాదం... ఉగ్రవాదపు పోకడల
ఊడలు పాకుతూ... ఉసురులు పోసుకుని... ఊపిరిలు హరిస్తుంటే...
విజ్ఞత... విలువలు... విధేయతలను జనం విస్మరిస్తుంటే...
మానవీయ సంబంధాలు మరుగున పడిపోతుంటే...
మమతానురాగాలు మసకబారి పోతుంటే...
ఘన సంస్కృతిని నేడు గెద్దల పాలు చేస్తుంటే...
ప్రగతీ ఉంది... దిగజారుడుతనం పెరిగింది
ఉపేక్షిస్తే... మన ఔనత్యాన్ని కోల్పోతాం
జాగృతమై మనం... సంస్కరించే దిశగా సాగుదాం...

...రచయిత
కె.వి.ఎస్. నరసింహం

## పంచాంగం

మాసం : ఆషాడం; తిథి: శు. చతుర్థశి పూర్తి జ్యేష్ఠ ఉ. 11-37 వర్జ్యం లేదు

శుక్రవారం 07-07-2017

**మేషం** :స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. బేకరి, పండ్ల, స్వీట్ వ్యాపారాలు జోరుగా సాగుతాయి. గృహోపకరణాలు, వాహనం అమర్చుకుంటారు.గతంలో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థికస్థితి కొంత మెరుగనిపిస్తుంది. వైద్య రంగాల వారికి గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. ఆడిట్, అకౌంట్స్ రంగాల వారికి పని ఒత్తిడి, చికాకులు తప్పవు.

**వృషభం** : ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. చీటికి, మాటికి ఎదుటివారిపై అసహనం ప్రదర్శిస్తారు. హోటల్, క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. ఒక వేడుకను ఘనంగా నిర్వహించటానికి యత్నాలు మొదలెడతారు. కొంత మంది మీ పలుకుబడి ద్వారా లబ్ధి పొందుతారు.

**మిధునం** : ఓర్పు, నేర్పుతో అనుకున్నది సాధిస్తారు. నూతన ప్రదేశాలు సందర్శనలు అనూకిలిస్తాయి. వృత్తుల వారు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిది. కోర్టు వ్యవహారాలు, భూ వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగస్తులకు రావలసిన క్లయింలు, అలవెన్సులు ఆలస్యంగా అందుతాయి.

**కర్కాటకం:** బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఏ విషయంలోను ఒంటెద్దు పోగడ మంచిది కాదు. మీ శ్రీమతి మొండివైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం.

**సింహం:** స్త్రీలకు అలంకారాలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. సంఘంలో మీ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యల శాశ్వత పరిష్కారానికి బాగా శ్రమిస్తారు. అకాల భోజనం, శారీరక శ్రమ వంటి ఇబ్బందులెదుర్కొంటారు. ఇసుక, క్వారీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వాధికారుల నుంచి వేధింపుల తప్పవు.

**కన్య:** రాజకీయ నాయకులు సభ, సమావేశాల్లో పాల్గొంటారు. మనోధైర్యంతో యత్నాలు సాగించాల్సి ఉంటుంది. ఏజెంట్లు, బ్రోకర్లు, వృత్తుల వారికి సదవకాశాలు లభిస్తాయి. బంధుమిత్రుల నుంచి ఒత్తిడి, మొహమ్మాటాలు ఎదుర్కొంటారు. ప్రముఖ ఆలయాల్లో దైవదర్శనాలు అతికష్టం మీద అనుకూలిస్తాయి.

**తుల:** ఒక స్థిరాస్తి విక్రయించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. ధనవ్యయం అధికంగా ఉంటుంది. మార్కెట్ రంగాల వారు టార్కెట్లను సునాయాసంగా పూర్తి చేస్తారు. క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. మీ భావాలు, ఆలోచనలకు మంచి స్ఫూర్తి లభిస్తుంది. కోర్టు వ్యవహారాలలో ప్లీడర్లకు చికాకులు అధికమవుతాయి.

**వృశ్చికం:** ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఒత్తిడి అధికం. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. ప్రింటింగ్ రంగాల వారికి మందకొడిగా ఉంటుంది. మీ జీవిత భాగస్వామి సలహా మీకెంతగానో నచ్చుతుంది. పత్రిక, వార్తా సంస్థలలోని వారి ఏమరుపాటుతనం వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు.

**ధనుస్సు:** ఎంత శ్రమించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. స్త్రీలకు షాపింగ్‌లోను, పనివారల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. నిరుద్యోగులు వచ్చిన తాత్కాలిక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం శ్రేయస్కరం. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు.

**మకరం:** ఆడిట్, అకౌంట్స్ రంగాల వారికి పని ఒత్తిడి, చికాకులు తప్పవు. బంధువులతో చిన్న చిన్న కలహాలు జరిగే ఆస్కారం ఉంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. ప్రముఖుల పరిచయాలు, పాత మిత్రుల కలయిక మీ ఉన్నతికి దోహదపడతాయి. ఆదాయానికి సరిపడని ఖర్చు కానవస్తుంది.

**కుంభం:** దూర ప్రయాణాలలో వస్తువుల పట్ల మెళుకువ అవసరం. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఇంజనీరింగ్, మెడికల్, కంప్యూటర్, శాస్త్ర రంగాల వారికి పురోభివృద్ధి. ముఖ్యమైన పర్యటనలలో అవాంతారాలు ఎదురైనా జయం పొందుతారు. సమయాన్ని వృధా చేసే కొలది నష్టాలను ఎదుర్కొంటారు.

**మీనం:** వ్యాపారాల్లో నష్టాలు, ఆటంకాలు క్రమేణా అధికమిస్తారు. స్త్రీలపై సన్నిహితులు, చుట్టుపక్కల వారి ప్రభావం అధికంగా ఉంటుంది. వాహనం నిదానంగా నడపటం క్షేమదాయకం. నూనె, ఎండుమిర్చి, పసుపు, ధనియాలు, బెల్లం, శనగలు వ్యాపారస్తులకు స్టాకిస్టులకు అనకూలమైన కాలం. ఉపాధ్యాయులకు అనుకూలం.



# సన్మార్గమే నిర్దేశం కావాలి

## సంకీర్తన

**నిర్దేశం** అనే పదానికి చూపించు, ఆజ్ఞాపించు, సూచించు అని అర్థాలున్నాయి. నిర్దేశకుడు అంటే ఆజ్ఞాపించువాడు, చూపించువాడని అర్థం. దేనిని చూపాలి? ఏం ఆజ్ఞాపించాలి..? అనేవి ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. గీతలో అర్జును డికి మార్గోపదేశం చేయడంతో పాటు తానే మార్గ నిర్దేశం అయ్యాడు కృష్ణ భగవానుడు. ఈ జగత్తులో ప్రతి మానవుడు తాను జీవించే విధానం లేదా కర్మల ద్వారా సమాజాన్ని ప్రేరేపిస్తుం టాడు. కొందరు రచనల ద్వారా, మరికొందరు కళల ద్వారా, ఇంకొందరు వృత్తిద్వారా మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నారు. ప్రకృతిలోని ఇతర జీవరాశులు సైతం తమదైన శైలిలో మార్గనిర్దేశం చేస్తుంటాయి.

సత్యయుగంలో మానవులు షోడష కళలతో సర్వ శ్రేష్టంగా జీవించేలా దేవతలు మార్గనిర్దేశం చేశారు. తేత్రాయుగంలో సైతం మానవులు గౌరవం, సోదరభావంతో మెలుగుతూ సామాజిక విలువలను ఉన్నతపథంలో నిలిపారు. ద్వాపర యుగంలో భక్తిమార్గం సమాజానికి సరైన దిశా నిర్దేశం చేసింది. రుషులు, మునులు, తపోధ నులు.. పరమాత్ముడి గుణగణాలను తెలియజేస్తూ ఎన్నో కావ్యాలను వెలువరించారు. ధర్మగ్రంథాలుగా ప్రాచుర్యం పొందిన ఈ కావ్యాలు నేటికి సామాన్య మానవులకు సైతం మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

సాంఘిక జీవనంలో భాగంగా ఉన్న మనం.. ఆ సమాజానికి కీడు తలచడం సరికాదు. ప్రాణికోటి శుభం కోరే పరమాత్ముడి సంతానంగా ఉన్న మనం.. అశుభం కోరడం సమంజసం కాదు. ఎన్ని కష్టాలు ఉన్నా.. మనసా, వాచా, కర్మణా మంచినే కోరాలి. పరమ శివుడు నిర్దేశించిన శ్రీమతం ద్వారా సర్వ సమాజానికి అంతా మంచే జరుగుతుంది. మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యలు యుద్ధంలాంటివైతే.. వాటిని ఎలా గెలువగలమో నిర్దేశిస్తూ మరొకరికి మార్గదర్శనం చేయాలి. పలాయనవాదులను చరిత్ర అసమర్థులుగా తేల్చి చెప్పింది. కష్టనష్టాలకోర్చి ముందుకు సాగేవాడే సమర్థుడు. అందుకే స్వామి వికేకానందుడు సమర్థవంతులైన కొందరి జీవితమే చరిత్ర అని వ్యాఖ్యానించారు. బీదవాడుగా జన్మించడం తప్పుకాదు. పేదవాడిగా మరణించడమే తప్పు అంటూ ఓ కవి నిర్దేశించారు. దీన్ని సార్థకం చేసుకున్నవారే సమర్థులు. అలాగని ప్రతి ఒక్కరూ ధనవంతులై పోవాలని కాదు. స్వయంకృషితో ఎదగాలని కవి భావం. ప్రతి వ్యక్తీ తన కుటుంబ పోషణకు సరిపడా ధనం ధర్మమార్గంలో సంపాదించాలి. కాని, అవసరాల కోసం పక్కవాడి పొట్ట కొట్టకూడదు. మాయమాటలు చెప్పి సాయం పొందడం అనైతికం. బీదరికం అనేది జీవిత సామర్థ్యం నిరూపించుకోవడానికి అందిన వరంగా భావించాలి. అందుకు తగ్గట్టుగా ధర్మబద్ధమైన మార్గాన్ని నిర్దేశించుకోవాలి. ఈశ్వరీయ జ్ఞాన యోగాల సంపదను సముపార్జించ కుండా శరీరం వదలడం అంటే మీ జీవనయానం సరైన దిశలో సాగలేదనే అర్థం.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ఏది మంచి, ఏది చెడు తెలియజేస్తూ మనుష్యులను ముందుకు నడిపిస్తు న్నాయి. ఆదికాలం నాటి మానవ జీవన విధానం వేదాలలో అక్షర రూపమైందా..? వేదాక్షర రూపాన్ని మానవులు పాత్రగా పోషించి ఇతిహాసం అని అంటున్నారా..? అనేది అసలు ప్రశ్న. అయితే ఈ రెండూ ఒకే చక్రంలో తిరుగుతున్నాయి. ఇందులో ఏది ముందు, ఏది తర్వాత అన్న భేదం లేదు. ఈ రెండూ మనుష్య జాతిని సరైన మార్గంలో నడిపిం చడానికి పరమాత్ముడు సృష్టించిన అద్భుతమైన శక్తులే.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# బాబుజగజ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషిచేయాలి

## డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు

నర్సీపట్నం : దివంగత మాజీ ఉప ప్రధానమంత్రి, దళిత జనోద్ధరణకు పాటుపడిన బాబు జగజ్జీవన్‌రామ్ 31వ వర్ధంతిని స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సహాయ సాంఘిక సంక్షేమశాఖాధికారి సత్యనారాయణ , డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబుజగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాబుజగజ్జీవన్‌రామ్ ఉప ప్రధాన మంత్రిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ప్రస్తుతం ఉన్న హాస్టళ్ల ఆయన కృషివలనే కార్యరూపం దాల్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు గ్రామంలో దళితులు గ్రామ బహిష్కరణ జరగడం జీర్ణించుకోలేని విషయమన్నారు. జిల్లాలోని రావికమతం మండలం దొండపూడి గ్రామంలోనూ నవీన్ కుమార్ అనే పాలిటెక్నిక్ విద్యార్థి హత్య విషయంలో దోషులను శిక్షించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వార్డెన్ ఎం.నాగలక్ష్మి, కోటవురట్ల డీహెచ్‌పీఎస్ కార్యవర్గ సభ్యులు పి.అప్పల రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాబుజగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎఎస్‌డబ్ల్యూవో సత్యనారాయణ, డీపీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు

SVR గోల్డ్ లోన్స్
మీ బంగారాన్ని బ్యాంక్/ప్రైవేటు సంస్థలలో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటు కంటే ఎక్కువకు కొనబడును.
Contact No:
75696 87774

శ్రీ దుర్గా మల్లేశ్వర ద్వాదశి జ్యోతిర్లింగ దేవాలయం
వివాహ విషయంలో ఆటంకములు ఎన్ని సంబంధములు చూసినా కుదరకపోవుట(స్త్రీలు, పురుషులు) సంతానం లేకపోవుట, వ్యాపార విషయంలో ఆందోళనలు, ఎంత కష్టపడినా ఫలితం లేకపోవుట, సమస్యల వలన సతమతమవుట, పైన ఉదహరించిన సమస్యలకు జాతక చక్రం వేసి, నాడీ పరీక్షించి, హస్త సాముద్రికం ద్వారా మీ సమస్యలకు ఖచ్చితమైన పరిష్కారం చూపబడును.
కాలసర్ప దోషం, నాగదోషం, కుజదోషం, రాహుకేతువుల పూజ, వివాహ విషయములకు, అన్ని రకముల పూజలకు సంప్రదించవచ్చును.
పెళ్ళిరోజు, పుట్టినరోజు, మీ ఉద్యోగ విరమణ ఇలా మరే సందర్భంలో అయిన అన్నదానం చేయు భక్తులు ముందుగా సంప్రదించినచో అతి తక్కువ ఖర్చుతో అన్నదాన కార్యక్రమం జరిపించి మరియు మీ గోత్ర నామముపై విశేష పూజ జరుపబడును.
సూచన : ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని రావలెను.
హైస్కూల్ గ్రౌండ్ ఎదురుగా, దేవి పీఠం, కొత్తవలస, విజయనగరం జిల్లా.
9441126714
8331827714



సీజనల్ వ్యాధులు ( మలేరియా , డెంగ్యు చికున్ గున్యా ) అరికట్టుటకు జివియంసి. ప్రజారోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో గురువారం కొత్త రోడ్ నారాయణ హై స్కూల్ మరియు పెందుర్తి గవర్నమెంట్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. బర్మా క్యాంపు, గవర కంచర పాలెం, మర్రిపాలెం పలు అవగాహన సదస్సులు నిర్వహించారు

## తపాలాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

కర్నూలు : గాంధీ జయంతిని పురస్క రించుకొని భారత తపాలా శాఖ ఇన్‌లాండ్ లెటర్, ఎన్వలప్ కవర్ విశిష్టత గురించి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు కె.వి.సుబ్బా రావు తెలిపారు.

## పెంపుడు జంతువుల ద్వారా

# వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### (మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనిత)



వ్యాక్సిన్‌లు వేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

నర్సీపట్నం : పెంపుడు జంతువుల ద్వారా కూడా వ్యాధులు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చింతకాయల అనిత సూచించారు. గురువారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఏడీ సీహెచ్ గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమన్నారు.

పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. మున్సిపల్ కమీషనర్ జె.సురేంద్ర మాట్లాడుతూ వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్‌లు చేయడం ప్రారంభించామన్నారు.

ఏడీగణేష్ మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధులు గురించి వాటిని నియంత్రించే విధానం గురించి అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో చెట్టుపల్లి వీఏఎస్ అనిల్‌కుమార్, మాకవరపాలెం వీఏఎస్ దుర్గాప్రసాద్, వేములపూడి వీఏఎస్ డా.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నువ్వు పంట కోతల్లో

# రైతులు బిజీబిజీ



వేపాడ : మండలంలో రైతాంగం సాగు చేపట్టిన నువ్వుపంట కోతదశకు చేరుకోవడంతో కోతల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు.

మదుపు లేని పంటగా గుర్తింపు పొందిన నువ్వుసాగుపై దృష్టి సారించారు. నువ్వుపంట ఆశాజనకంగా రావడంతో పాటు పంట దశకు చేరుకోవడంతో కోతలపై దృష్టిసారిస్తున్నారు.

దిగుబడి బాగుండ వచ్చునని వాతావరణం అను కూలిస్తే ఖరీఫ్ వరిసాగు మదుపునకు డబ్బులు వస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# పారిశుద్ధ్యంపై అవగాహన



వేపాడ : గ్రామాల్లో పారిశుద్ధ్యం నివారణకు చర్యలు తీసుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అడ్డుకట్ట వేయాలని ఎంపిడిఓ వి.లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నీలంకంతరాజపురం, చినగుడిపాల, కుమమ్మ పల్లి గ్రామాలను సందర్శించి ప్రజలకు పారిశుద్ధ్యం, తాగునీటి పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు, ఈగలు వ్యాప్తి అధికంగా ఉంటుందని, తద్వారా వ్యాదులు ప్రభలే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పరిసరాల పరిశుభ్రతతో పాటు వీధుల్లో చెత్తా చెదారాలను తొలగించడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పైడిరాజు, ఇఓపిఆర్‌డి ధర్మారావు, సర్పంచ్‌లు చిన్నతల్లి, సింహాద్రప్పడు, లక్ష్మి, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు సాక్షరభారత్ కోఆర్డినేటర్, గొర్లె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా డిఇడి ప్రథమ సంవత్సరం పరీక్షలు



సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో డిఇడి ప్రథమ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. చీఫ్ సూపరింటెండ్ ఎన్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ ఈ పరీక్షలకు 203 మంది విద్యార్థులకు 194 మంది హాజరయ్యారని అన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించా మన్నారు. ఎటువంటి అవాంఛిత సంఘటనలు జరగకుండా సెక్యూరిటీ వుంచామన్నారు. ఈ పరీక్షలకు 6 పాఠశాలలు నుంచి హాజరైనారని అన్నారు.

## అడవివరం సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా కర్రీ అప్పలస్వామి



సింహాచలం : గ్రేటర్ విశాఖ 72వ వార్డ్ లో ఉన్న అడవివరం సహకార పరపతి సంఘం పాలకవర్గం ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. పాలక వర్గసభ్యులంతా కర్రీ అప్పలస్వామి ని ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ముందుగా ఎన్నికల అధికారి జానికి రామ్ సభ్యులందరిచేత సంతకాలు చేయించారు. అనంతరం ఎన్నికల అధికారి జానికిరామ్ పూలమాల వేసి మినిట్స్ పుస్తకాన్ని బ్యాంక్ నూతన అధ్యక్షులు కర్రీ అప్పలస్వామికి అందజేశారు. బ్యాంక్ ఉప అధ్యక్ష పదవి ఎన్నికను వాయిదా వేశారు. ఉపాధ్యక్ష పదవికి కొంతమంది ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. అయితే ఒక వ్యక్తికి ఉపాధ్యక్ష పదవి ఇవ్వకపోతే మరళ కథ మొదటికి వచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి విజేఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, 72వ వార్డ్ కాంగ్రెస్ కీలకనేత కర్రీ సత్తిబాబు బృందం తదితరులు హాజరయ్యారు.

## విద్యుత్తు చౌర్యంపై విస్తృత దాడులు

ఒంగోలు : విద్యుత్తుశాఖ అధికారులు విద్యుత్తు చౌర్యంపై విస్తృత దాడులు నిర్వహించారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ హెచ్.వై. దొర, విజిలెన్సు జేఎండీ ఉమాపతి ఆదేశాల మేరకు సర్కిల్ ఎస్ఈ ఎన్‌వీఎస్ సుబ్బరాజు పర్యవేక్షణలో ఈ దాడులు జరిగాయి. ఒంగోలు, కందుకూరు, చీరాల, అద్దంకి, కనిగిరి, మార్కాపురం డివిజన్లకు చెందిన 101 మంది అధికారులు దాడులు చేశారు.

# గిరిప్రదక్షణలో ఎటువంటి అసౌకర్యం కలిగిన కొండక్రింద కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు :ఈఓ



సింహాచలం : సింహాద్రినాధుని గిరిప్రదక్షణకు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండవచ్చు అనే ఉద్దేశంతో ముందుగా దేవస్థాన అధికారులతో పాటుపోలీస్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగుచర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. స్వామివారి ప్రచార రథంతోపాటు భక్తులు కాలినడకన సింహాచలం తొలిపావంచా మొదలుకుని అడవివరం, ముడసరిలోవ, హనుమంతువాక, విశాలాక్షినగర్, అప్పుఘర్, ఆర్.కె.బీచ్,తాటిచెట్లపాలెం, మురళీ నగర్, మాదవధార, ఎన్ఎడి కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురంమీదు నుంచి భక్తులు మెట్లమార్గం వెంబడి కొండపైకి చేరుకుంటారన్నారు . మార్గం మధ్యలో భక్తులకుఎటువంటి అసౌకర్యం కలగకుండా సింహాచలం దేవస్థానం అధికారులతో పాటు స్వచ్ఛందసంస్థలు, పెద్ద ఎత్తున స్టాల్స్‌ను ఏర్పాటు చేసి మంచినీళ్లు, మజ్జిగ, పాలు, టీతో పాటుపులిహోరా లాంటివి భక్తులకు ఉచితంగా పంపిణీ చేసే విదంగా తగుచర్యలు చేపడుతున్నాం అన్నారు. పెద్ద ఎత్తున మహిళలు గిరిప్రదక్షణలో పాల్గొనడంతో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా నగర పోలీస్ కమిషనర్ కు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేయమని పోలీస్ కమిషనర్ ను కోరామని



కార్యనిర్వాహణాధికారి తెలిపారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం మంచినీటి సరఫరా, అంబులెన్స్ , ఇతర అత్యవసర నిమిత్తం కొండక్రింద కంట్రోల్ రూమ్ నెంబర్లలు 0891-2745435, 2764949, వివి రామారావు 9849691341, ఎం మోహనరావు 9490497979కు సంప్రదించగలరు.

## సెప్టెంబరు నాటికి ఎన్టీఆర్ ఇళ్లు

ఆధోని : ఆధోని డివిజన్‌లో ఎన్టీఆర్ గ ృహనిర్మాణ పథకం కింద 5,455 ఇళ్లు మంజూరయ్యాయని ఆదోని హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వివిధ గృహాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద ఆదోని డివిజన్‌కు రూ.81.82 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే 521 ఇళ్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం 3,582 ఇళ్ల పునాదుల పనులు జరుగుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

**In the Honourable Court of the II Addl. Senior Civil Judge at Visakhapatnam.**
**EP 141/2016 in OS 1247/2012**

**Between :**
**Malla Trinadha Rao ...Dhr/Plaintiff**
**And:**
**Kandregula Anusuya & Anr ...Jdr's/Defendants**

**<u>వేలం ప్రకటన</u>**

యిందు మూలంగా యావన్మందికి తెలియజేయునది వాది తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం జెడిఆర్స్ తాలూకు దిగువ షెడ్యూలు ఆస్థిని అమ్మవలసినదిగా కోరుతూ పై అమలు పిటిషన్ దాఖలు చేసి యున్నందున, **తే 28-07-2017దిన ఉదయం 10-30 గం॥ల** లగాయితు సాయంత్రం 5.00 గం॥లలోపు పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. కావున కావలసిన వారు పాటలో పాల్గొని పాడుకొనవలెయును.

**షెడ్యూలు ఆస్థి వివరాలు:**

**SCHEDULE**

**PLAINT SCHEDULE PROPERTY**

**With in the registrar and sub-registrar of Akkayyapalem, Visakhapatnam Dist. An extent of 51.61 Sq.Yards in S No 159, bearing D.No.45-32-4, Assessment No.55924, and D.No.45-32-4/2/1, Assessment no.100003/90065, Current Service connection No.233037 with ground floor 464 Sq. feet R.C.C., First floor 464 Sq. Feet R.C.C, Second floor 464 Sq. Feet with R.C.C and Third floor 265 Sq. Feet A.C.C. Sheets house, near Sangam Office, Akkayyapalem, Visakhapatnam.**

**In the above schedule an Extent of 6.455 Sq. yards or 5.397Sq.Meters undivided share land including an extent of 232 Sq Feet ACC sheet House given as security in the above Regd. Mortgage Deed Dated 01-11-2010 bonded by:**

**East : Joint wall between this house and Kandregula Chandrasekar's house**
**South : 2 feet Sandhu**
**West: Joint wall between this house and Kandregula Govindarao's house**
**North : Common Passage**

**తదుపరి విచారణ : 10-08-2017**

**Sri. KARRI ADI BABU**
**Advocate**
**Visakhapatnam.**
**Cell: 9396260139**

# రైతు సంఘ నాయకుడు మట్టా సత్యం మృతి

యానాం : కురసంపేట మట్టా గార్డెన్స్ సీనియర్ రైతు సంఘ నాయకుడు మట్టా సత్యం (83) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతిచెందారు. ఇటీవల అనారోగ్యానికి గురై అసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ ఫలితం దక్కకపోవడంతో ఆయన మృతిచెందారు. స్థానిక మార్కెట్ ఉద్యోగి మట్టా సురేష్ తండ్రి ఆయన మట్టా సత్యం మృతి వార్త తెలిసినవెంటనే రైతు సంఘం నాయకులు, రైతులు మార్కెట్ కమిటీ వ్యవసాయశాఖకు చెందిన అధికారులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. రైతు సంఘం మాజీ అధ్యక్షులు మల్లాడి సత్తిబాబు, అధ్యక్షుడు మల్లాడి శ్రీనివాసురావు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాజైటి సత్యభాస్కర్, ఎం. అనందరావు, ఎం. సుబ్బారావు, కె. కొండబాబు లు తమ ప్రగాఢ సంతతాపాన్ని తెలియజేశారు. స్థానిక టైటిల్ లాక్‌వద్ద స్మశానవాటికలో వేలాది మంది మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

# ఇంపికాప్స్ డైరెక్టర్ గా వడ్డాదికి చెందిన
## డా.యస్.శ్రీరామచంద్రమూర్తి



అన్నవరం : విశాఖపట్నం జిల్లా వడ్డాది గ్రామానికి చెందిన డా.సుంకరణం. శ్రీరామ చంద్రమూర్తికి ఇటీవల మద్రాస్ లో జరిగిన ఇంపికాప్స్ (ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోపరేటివ్ ఫర్మసీ అండ్ స్టోర్స్) ఎన్నికలలో డైరెక్టర్ గా మూడవ సారి ఏకగ్రీవముగా ఎన్నికైనారు. ఇది 70 సంవత్సరాలుగా చెన్నై కేంద్రంగా కొనసాగుతున్న ఇంపికాప్స్ లో 6 రాష్ట్రములకు చెందిన 16 మంది డైరెక్టర్ లను ప్రతీ 5 సంవత్సరములకు ఒక్క సారి ఎన్నుకొంటారు.అటువంటి ఈ ఇంపికాప్స్ గా శ్రీ రామచంద్రమూర్తి ఎన్నికపట్ల ఆంధ్రప్రదేశ్ బేసిక్ హెల్త్ కేర్ సొసైటీ అధ్యక్షుడు కరెళ్ళ.గణపతి రావు సెక్రటరీ పదిలం బెన్నబాబు పత్రికా ముఖంగా ప్రత్యేక అభిదందనలు తెలియ జేసారు. ఇటువంటి వ్యక్తి మా హెల్త్ కేర్ సొసైటీ లో గౌరవ అధ్యక్షుడిగా ఉండటం మా అదృష్టముగా బావిస్తున్నామని కరెళ్ళ కొనియాడారు.

# అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం

అన్నవరం : తూ.గో.జిల్లా శంఖవరం మండలం జి.కొత్తపల్లి గ్రామంలో పొన్నాడ శ్రీనుకి చెందిన తాటాకిట్లు దగ్ధమైంది.ఈ ప్రమాదంలో సర్వం బుడిద కావడముతో బాదితులు కట్టు బట్టలతో మిగిలి ఉండటాన్ని గమనించిన అన్నవరం ఎస్సై పార్థసారథి మంచి మనస్సుతో తనవంతు సహాయముగా వంట సామాగ్రి తదితర వస్తువులను అందజేశారు. అలాగే స్థానిక సత్యదేవ స్వచ్ఛంద సంస్థ మరియు బేసిక్ హెల్త్ కేర్ సొసైటీల ఆద్వర్యంలో బేసిక్ హెల్త్ కేర్ సొసైటీ సెక్రటరీ పదిలం బెన్నబాబు సత్యదేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రేపాక.వీర్రాజు సెక్రటరీ ఇండుగబల్లి నూకరాజు కార్యదర్శి బళ్ళ హరిబాబులు సంయుక్తంగా రెండువేల రూపాయలు మరియు కొన్ని బట్టలను కలపి స్థానిక పోలీసు స్టేషన్ లో ఎస్సై పార్ధసారది మరియు హెడ్ కానిస్టేబుల్ రాంబాబుల ద్వారా ఈ మొత్తాన్ని పొన్నాడ.శ్రీనుకి అందజేశారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి
## కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణిగా విజయ



యు.కొత్తపల్లి : మండల ప్రాధమిక వైద్య ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ) వైద్యాదికారిణిగా సానా విజయ బాధ్యతలు చేపట్టారు. ఈమె మల్లాం పిహెచ్‌సీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు కొత్తపల్లి పిహెచ్‌సీ డాక్టర్‌గా పనిచేసిన ప్రశాంతి ఉన్నత విద్యకు వెళ్ళడంతో విజయ డాక్టర్ బాధ్యతలు చేపట్టారు. పిహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందిస్తా నని డాక్టర్ విజయ తెలిపారు. గర్భిణి, బాలింతలకు నిరంతరం సేవలందిం చేందుకు తాను స్థానికంగా మకాం కూడా ఉంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో ప్రతీ ఒక్కరూ వ్యాధుల పట్ల అప్రమ త్తంగా ఉండాలన్నారు. నిలువ పదార్ధాలను తినరాదన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాల న్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడం వలన అనారోగ్యాలు దరిచేర వని డాక్టర్ విజయ తెలిపారు. ప్రజలకు ఎటువంటి వైద్యసాయం అవసరమైనప్పటికీ ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పిహెచ్‌సీలోనే అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని డాక్టర్ విజయ తెలిపారు.

# గోదావరిలో మృతదేహం లభ్యం

యానాం : భార్య పోలీసులకు ఫిర్యాదుచేయడంతో మనసు తాపానికి గురైన మహిపాల్ వీధికి చెందిన చిల్లర కూరగాయల వ్యాపారి మన్నె అర్జునరావు (34) గోదావరిలోకి దూకి మృతదేహమై తేలియాడాడు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో బాలయోగి వారధి జీసెస్ విగ్రహం సమీపంలో గోదావరిలో మృతదేహంగా తేలియాడటంతో పోలీసులుగుర్తించి మృతదేహాన్ని యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య పోలీసులకు ఫిర్యాదుచేయడంతో మూడురోజుల నుండి కనిపించకుండా పోయి శవమై తేలడంతో పోలీసులు కేసు నమోదుచేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువలకు అప్పగాంచనున్నట్లు తెలిపారు.

# రేపు జాతీయ లోక్ అదాలత్

ఆలమూరు : స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 8వతేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, ఆలమూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎమ్. సుబ్బారావు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడే సివిల్, క్రిమినల్, భీమా ఎక్సైజ్, ప్రీ లిటికేషన్ ఇతర కేసులు పరిష్కరించుకోవచ్చునని ఆయన తెలిపారు.

# ఈ నెల 9న బాబా గురుపూజోత్సవం

ఆలమూరు : మండల కేంద్రం ఆలమూరులో వేంచేసియున్న 58 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ షిరిడి సాయిబాబా వారి ఆలయంలో ఈ నెల 9వతేదీన (ఆదివారం) గురుపూర్ణిమ సందర్భంగా గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 3-30 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించబడునని అన్నారు. మధ్యాహ్నం 12-30 గంటలకు వంటిపల్లి పాపారావు సమకూర్చిన రూ.30వేల విలువగల రైస్, క్యానం సాయోజీరావు, (రిటైర్డ్ ఆర్.డి.ఓ.) రూ. 8వేల ఆర్థికసహాయము, భక్తుల సహకారముతో అన్న సంతర్పణ జరుగునని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుండి అరవలపల్లి వెంకటేశ్వరరావు వారి ఆధ్వర్యంలో సాయి సమాజం వారిచే ఏకాహం, ద్రాక్షారామ వాస్తవ్యులు గాన కంఠీరవ బిరుదాంకితులు కె.వి.వి. సత్యనారాయణ (సత్తార్ స్వామి) ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తిరంజని కార్యక్రమం నిర్వహించబడునని వారు తెలిపారు. ప్రత్యేక పూజలు చేయించుకునే భక్తులు రూ. 30/- లు చెల్లించి, తమ గోత్రనామాలతో పూజచేయించుకొనవలసినదిగా వారు కోరారు.

# అడబాల ట్రస్ట్‌ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం

ఆలమూరు : మండల పరిధి చెముడులంక జెడ్.పి. హైస్కూల్ నుండి ఆ గ్రామానికి చెందిన అడబాల జయభవాని, ఎ. జాహ్నవి నాగదేవి, ఎ.ఎన్.ఎన్. మణిదీపికలు ట్రిపుల్ ఐ.టి.కి ఎంపికయ్యారు. ఈ ముగ్గురు బాలికలకు అదే గ్రామానికి చెందిన అడబాల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేసారు. నూజివీడు ట్రిపుల్ ఐ.టి. కళాశాలలో ప్రవేశ రుసుము చెల్లించేందుకు గాను ట్రస్టు ప్రతినిధి అడబాల కృష్ణ సమకూర్చిన ఈ ఆర్థిక సహాయాన్ని విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ సుబ్బారావు చేతులమీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో చోడిశెట్టి చంద్రశేఖర్, అడబాల మాచరయ్య, అడబాల ఆదినారాయణ, అడబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రత్నగిరిపై వనం-మనం
## కార్యక్రమంలో మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వరుపుల

అన్నవరం... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్న వరం శ్రీ వీరవెంకట సత్యనా రాయణ స్వామివారి రత్నగిరిపై గురువారం వనం-మనం కార్య క్రమంలో భాగంగా వివిధ రకములైన మొక్కలను స్థానిక ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల .సుబ్బారావు దేవస్థానం ఇన్ చార్చి ఈవో ఈరంకి.జగన్నాద రావు చైర్మెన్ ఐవి.రోహిత్ లు సంయుక్తంగా కలసి భక్తులకు పంపిణీ చేసి కొన్నిమొక్కలను రత్నగిరిపై వివిధ ప్రదేశములో నాటారు.

ఈ మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఇన్ చార్జి ఈవో ఈరంకి జగన్నాధరావు చైర్మెన్ శ్రీ రాజా ఐవి.రోహిత్ దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ పర్వత రాజబాబు పర్వత సురేష్ బద్ది.రామారావు శంఖవరం మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్తిబాబు టౌన్ ప్రెసిడెంట్ వీర్ల.సూరిబాబు రాజాల.చిట్టిబాబు పలివెల. సతీష్ బండారు. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి
## - పెదవాల్తేరు రైతుబజార్ ఎస్టేట్ అధికారి నలమహారాజు



విశాఖపట్నం : రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచాలని పెదవాల్తేరు రైతు బజార్ ఎస్టేట్ అధికారి బి. నలమహారాజు రైతులను కోరారు. రైతుబజారు పాత ఎస్టేట్ అధికారిణి సత్యకళకు బదలీ అవ్వడంతో సీతమ్మధార రైతుబజార్ నుండి నలమహారాజును ఇక్కడికి బదిలీచేశారు. ఆయన గురువారం ఆయన పదవీబాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎ.డి. కాళేశ్వరరావుతో కలిసి రైతుబజారును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతుబజారును శుభ్రంగా ఉంచాలని, వినియోగ దారులతో సవ్యంగా ఉండాలని వారికి తాజా కూరగాయలు అందుబాటులో ఉంచాలని ఎట్టిపరిస్థితుల్లోను అవతవకలకు పాల్పడవద్దని, మీకు ఏ సమస్యవచ్చినా నేరుగా నాతో సంప్ర దించండని రైతులను కోరారు. వినియోగ దారుల కోరిక మేరకు రైతుబజారు ఆగస్టు 1వ తేదీ నుండి రెండవపూట కూడా తెరచిఉంచ డానికి జాయింట్ కలెక్టర్ సృజనా అంగీకరిం చారన్నారు.

# 8న పుదుచ్చేరి బంద్

యానాం : నామినేటెడ్ ఎమ్మెల్యేలను అధికారంలో ఉన్న పార్టీ నియమించుకోవలసి ఉండగా వారికి నామమాత్రంగానేనా తెలియ జేయ కుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా నామినేటెడ్ ఎమ్మెల్యేలను నియమించి పుదుచ్చేరిలో ప్రజా స్వామ్యాన్ని ఖూనీచేయడానికి నిరసనగా ఈ నెల 8న పుదుచ్చేరి బంద్‌కు పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు పిలుపునిచ్చాయి. పుదుచ్చేరి లోని తమిళసంఘంలో నిర్వహించిన ఒక సమావేశంలో పలు స్వచ్ఛంద సంస్థలు, పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానం చేసాయి. సమావేశంలో లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడిని కేంద్రంలో బిజెపి నేతలను తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రజాబలం లేకుండా దొడ్డిదారిన బిజెపి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తుందని విడుదలై చిరుతల్ కచ్చి, పుదుచ్చేరి మానవ హక్కుల వినియోగ దారుల పరిరక్షణ సంఘం, లోక్‌జనశక్తి, తదితర అనేక సంఘాలు సమావేశంలో పాల్గొన్నాయి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఉద్యమానికి మాజీ సిఎం రంగసామి మద్ధతుఇవ్వాని సంఘాలు డిమాండ్ చేశాయి. పుదుచ్చేరిలోని అధికార కాంగ్రెస్ పార్టీ జరగున్ను బంద్‌కు తన సంపూర్ణమద్ధతు ప్రకాటించింది.

# అన్న అమృతహస్తం,,అమ్మకు ఆరోగ్యం

పెదపూడి: అనపర్తి పరిసర గ్రామంలో గల గర్భిణీలు బాలింతలు ఆరోగ్య పరిరక్షణతో పాటు పండంటి బిడ్డల జననమే అన్న అమృతహస్తం లక్ష్యమని అనపర్తి శాసనసభ సభ్యుడు నల్లమిల్లి రామకృష్ణరెడ్డి అనపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన అన్న అమృత హస్తం కార్యక్రమంలో ఆయన అన్నారు స్త్రీ శిశుసంక్షేమ శాఖ పరిధిలో అంగన్వాడీ కేంద్రంల ద్వారా గర్భిణీలు బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం కింద ఇంటికి రేషన్ లక్ష్యం నెరవేరడంలేదని ప్రభుత్వం గుర్తించి అన్న అమృత హస్తం పేరుతో అంగ న్వాడీ కేంద్రంలో ఒక పూట భోజనం అందిస్తాం దని ప్రతీ బాలింతలు,గర్భిణీలు దీనిని సద్వి నియోగం చేసుకోవాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్న అమృత హస్తం ఆపన్న హస్తంగా మారిందని ఇది నిజంగా పేద,మధ్య తరగతి గర్భిణీలు, బాలింతలకు అమృతహస్తమే అని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమనికి అన్నవరం దేవస్థా న పాలకవర్గ సభ్యులు సత్తి దేవనంద రెడ్డి,కర్రి దొరబాబు,సింగినీడి నాగతిరుపతిరావు (దత్తుడు) అంగన్వాడీ కేంద్ర నిర్వాహక సభ్యులు,పలువురు రాజకీయ నేతలు హాజరయ్యారు



రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సాధించిన విజయాలను టి.డి.పి. ఎస్.సి. సెల్ నగర వైస్ ప్రెసిడెంట్ గంట్యాడ శంకరరావు ఆధ్వర్యంలో 15వ వార్డు అశోక్ నగర్ ఎస్.సి. వీధిలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి పనుల గురించి తెలుపుతూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో గొలగాని వీరరావు బుజ్జి. జి. శంతకుమారి, జె. సుందరరావు, జె. నాగభూషణం, ఎం. ఎల్లాజిరావు, ఇ. ప్రసాద్, చింతడ సూర్యం పాల్గొన్నారు.

# బాలికల సంరక్షణకు బృహత్తర ప్రణాళికలు



యానాం: దేశంలో బాలికల సంఖ్య రోజు రోజికి తగ్గ ముఖం పట్టడంపై బాలికల సంరక్షణకు భారతప్రభుత్వం బహుత్తర ప్రణా ళికలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందని పరిపాలనాధికారి దువులూరి తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఢిల్లీలోని స్త్రీ మరియు శిశుసంక్షేమశాఖ పార్లమెంట్ ప్రక్కన జనతాథార్ భవనంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమానికి తాను హాజరయ్యానన్నారు. బాలికలు బాలురు సెన్‌సెస్ ప్రకారం వెయ్యిమంది బాలురకు గాను 800 మంది బాలికలు ఉండటంపై తీసుకొవలసిన చర్యలపై వివిధ రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. బాలికలు తగ్గుముఖం పట్టకుండా ఉండేందుకు భారతప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిం దన్నారు. బాలికలు పుట్టకుండా చంపడం పట్ల గర్భిణీగా ఉండగా ఆడ, మగా పిల్లలు పరిక్షలు చేయించుకుని ఆడపిల్లని తెలితే అబార్షన్లు చేయడం నియంత్రించేందుకు ఇసిపిసి చట్టం తీసు కొచ్చిందన్నారు. ఆర్ఎంపి డాక్టర్లు, ఆయాలు స్కానింగ్‌లు చేయించి అబార్షన్లు చేయించడంలో వీరి పాత్ర కీలకంగా ఉందని దీనిపై చర్యలు చేపట్టేందుకు ఆయా రాష్ట్ర అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నామన్నారు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రల్లో ఇటువంటి పరిస్థితులు ఉండటాన్ని రెండ్ కేటగిరిలో వచ్చాయన్నారు. తమిళనాడు, కేరళ అమ్మాయిలను ఇతర రాష్ట్రాల పురుషులు వివాహాలుచేసుకుంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. కొన్ని కులాల్లో అయితే ఆడపిల్లలు లేని పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఈ పరిస్థితి తగ్గుమెఖం పట్టేలా చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడి బేటీబాచావో, బేటీ పాడావో కార్యక్రమం చేపట్టారన్నారు. యానాంలో చేస్తున్న కార్యక్రమాలు చూసి ఎక్కువ నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిం దన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ జిల్లాలో, తమిళనాడు కడలూరులో అతితక్కువగా ఆడపిల్లల జననం ఉన్నట్లు నమోదు అయ్యిందన్నారు. యానాం ఆసుపత్రికి పక్క గ్రామాల నుండి వచ్చి గర్భిణులు పురుడుపోసుకుంటున్నారని, యానాంలో ఉన్న గర్భిణులు కాకినాడ వెళ్ళి పురుడుపొసుకుంటున్నారన్నారు. యానాంలో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమానికి జిల్లా పౌరసరఫరాల శాఖ, సమాచార శాఖ అధికారి, ఫ్రాన్స్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ ఏడాది రూ. 36.30 లక్షల నిధులు విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కోరామని దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారన్నారు. ప్రతి ఇంటికి స్టికర్లు, పోస్లర్లు కళాశాల్లో బాలికలకు శానిటేషన్‌పై అవగాహన కల్పించేందుకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నా మన్నారు. పరిశుభ్రమైన నీరు, పరీక్ష సమయాల్లో పరీక్షపేడ్‌లు ఇస్తామన్నారు. భవిష్యత్‌లో ఆడపిల్లలకు కన్యాశుల్కం ఇచ్చి వివాహంచేసే పరిస్థితులు రానున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సాంఘిక సంక్షేమ శాఖలద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. దీనికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

# స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి...కలెక్టరేట్ వద్ద ధర్నా
## స్వర్ణకారులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి :బిసి ఉద్యమనాయకుడు పెద్దింశెట్టి



కాకినాడ : జిల్లాలో స్వర్ణకారుల(బంగారపు పనివారు) జీవితాలు తీవ్ర దుర్భర పరిస్థితి అనుభవిస్తున్నాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా గురువారం కాకినాడ గోల్డ్ మార్కెట్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మోడరన్ ప్రపంచంలో చేతిపనిపై ఆధారపడి చేసే బంగారపు పనివారికి కనీసం జీవనోపాధి కరువైందన్నారు. గత మూడు సంవత్సరాలుగా స్వర్ణకారులపట్ల రాష్ట్ర ప్రభుత్వం అలక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. స్వంత గృహాలు లేక ఇంటి అద్దె చెల్లించలేని స్థితిలో స్వర్ణకార కుటుంబాలు ఉన్నాయన్నారు. యాంత్రిక ప్రపంచంలో చేతి వృత్తులు కనుమరుగై పోతున్నాయని, చేనేత కార్మికుల ఆత్మ హత్యలు లాగ బంగారు పనివారు ఆత్మ హత్యలు చేసుకొనే పరిస్దితి నెలకొందని రాష్ట్ర బిసి ఉద్యమ నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీ లేని బ్యాంకు రుణాలు మంజూరు చేసి స్వర్ణకార కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టడం జరుగుతుంద న్నారు. అలాగే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.అనంతరం కాకినాడ నగర అధ్యక్షుడు నరవం శ్రీనివాసరరావు మాట్లాడుతూ స్వర్ణకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మ హత్యలే శరణ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి స్వర్ణకారులను, స్వర్ణకార వృత్తిని కాపాడాలన్నారు.అనంతరం కల్టెర్‌కు వనతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి.శ్రీను,కోశాధికారి పి.శ్రీను,రాజా,ముజీబ్,టి.రాజుమల్లేవ్వరరావు, మోమన్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## జూ ఎన్టీఆర్ రాకుండా కుట్ర,

# అతడో జోకర్ ....



గత రెండు దఫాలుగా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా)లో జరుగుతున్న రాజకీయాలు సాధారణ ప్రేక్షకులను విస్మయానికి గురి చేస్తున్నాయి. అప్పట్లో రాజేంద్రప్రసాద్ ఎన్నిక సమయంలో జరిగిన రచ్చ ఇప్పటికీ ఇంకా ఎవరూ మరిచిపోలేదు. తర్వాత 'మా' అధ్యక్ష పీఠాన్ని నటుడు శివాజీ రాజా దక్కించుకున్నారు. మరో దఫా రాజేంద్రప్రసాద్ కొనసాగాల్సి ఉన్నా శివాజీ రాజా తెర వెనక రాజకీయాలు చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో అలిగిన రాజేంద్రప్రసాద్.... 'మా'తో అంటీ ముట్టనట్లు ఉంటున్నారని టాక్. తాజాగా శివాజీ రాజా వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ అయింది. 'శంకరాభరణం' సినిమాతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటి తులసి తాజాగా 'మా' అధ్యక్షుడు శివాజీరాజాపై తీవ్ర ఆరోపణలు చేశారు. అతణ్ని ఓ జోకర్‌గా అభివరి?ంచారు. తాను తలపెట్టిన శంకరాభరణం అవార్డుల కార్యక్రమానికి యంగ్ టైగర్ ఎన్టీయార్‌ను రాకుండా కుట్ర చేసింది శివాజీరాజా అని తులసి ఆరోపించారు. నటి తులసి 'శంకరాభరణం' పేరిట ప్రతీ ఏటా ఉత్తమ నటన కనబరిచిన వారికి అవార్డులు అందజేస్తున్న సంగతి తెలిసిందే.

# గుండె ఆ..గి పోతాందే





# ద్రౌపది పాత్రలో...?

క్రేజీ కథానాయికగా స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న మలయాళీ సోయగం నయనతార. ప్రస్తుతం వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా వున్న ఆమె త్వరలో ఓ మైథలాజికల్ చిత్రంలో నటించనుందని తెలిసింది. శ్రీరామరాజ్యంలో సీతగా, కాష్మోరా చిత్రంలో రత్నమహాదేవిగా తనదైన శైలిలో నటించి మెప్పించిన నయనతార త్వరలో ద్రౌపదిగా నటించనున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే...ఎం.టి. వాసుదేవన్ నాయర్ రాసిన రందమూళం నవల ఆధారంగా మహాభారతం నేపథ్యంలో మలయాళంలో ఓ సినిమా సెట్స్‌పైకి రానున్న విషయం తెలిసిందే. దాదాపు 1000 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ చిత్రంలో భీముడిగా మోహన్‌లాల్ నటించనున్నారు. కాగా ఇదే ఇతివ ృత్తంతో కన్నడంలోనూ ఓ భారీ చిత్రాన్ని తెరపైకి తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నారు. రవిచంద్రన్, దర్శన్, అంబరీష్ కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి నాగన్న దర్శకత్వం వహించనున్నారని తెలిసింది. కాగా ఇందులో ద్రౌపది పాత్ర కోసం పేరున్న పలువురు క్రేజీ కథానాయికల్ని పరిశీలించిన చిత్ర బ ృందం ఆ పాత్రలో నయనతారను ఖరారు చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఇటీవలే చిత్ర వర్గాలు ఆమెను సంప్రదించాయని, కన్నడంలో ఇప్పటి వరకు ఒకే ఒక్క చిత్రం(సూపర్)లో నటించిన నయనతార ఈ సినిమాలో నటించడానికి సుముఖంగా వుందని తెలిసింది. కన్నడ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మితం కానున్న ఈ చిత్రానికి కురుక్షేత్ర అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 23న లాంఛనంగా ప్రారంభం కానుందని తెలిసింది.

# కృష్ణవంశీతో పనిచేస్తున్నా అంటే..



మెగా ఫ్యామిలీ హీరోగా ముద్ర పడిన సాయి ధరమ్ తేజ్ వరుస విజయాలతో దూసుకెళు ్తన్నాడు. నటనలో సొంత ఐడెంటిని క్రియేట్ చేసుకోవడానికి విభిన్నమైన పాత్రల్లో నటిస్తున్నారు. డ్యాన్సులు, ఫైట్లతో ఈ మెగా హీరో ఇరుగదీస్తున్నారు. ఆ క్రమంలో తేజ్‌కు వచ్చిన అవకాశమే నక్షత్రం. సినీ పరిశ్రమలోకి ప్రవేశించిన కొద్ది రోజులకే క ృష?వంశీ లాంటి క్రియేటివ్ డైరెక్టర్‌తో పనిచేసే అవకాశాన్ని దక్కించుకొన్నారు. కృష్ణవంశీ రూపొందిస్తున్న నక్షత్రం చిత్రానికి సంబంధించిన ఆడియో రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిధరమ్ తేజ్, సందీప్ కిషన్, రెజీనా జంటగా సాయిధరమ్ తేజ్, ప్రగ్యా జైశ్వాల్, కృష్ణవంశీ, నిర్మాతలు ఎస్



వేణుగోపాల్, సజ్జు, కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ధరమ్ తేజ్ మాట్లాడారు.గోవిందుడు అందరివాడేలే సినిమా షూటింగ్ సమయంలో రామ్‌చరణ్‌ను కలవడానికి వెళ్లాను. అప్పుడు కృష్ణవంశీతో జరిగిన మాటల సందర్భంగా 'ఎప్పుడైనా మీ సినిమాలో ఓ క్యారెక్టర్ ఉంటే చెప్పండి. చేస్తా' అని అన్నాను. నా మాటలను బాగా గుర్తుపెట్టుకొని 'నక్షత్రం'లో అలెగ్జాండర్ అనే మంచి క్యారెక్టర్ ఇచ్చారు. అలెగ్జాండర్ పాత్ర చాలా ఉద్వేగంతో కూడుకొన్నది. నటుడిగా నాకు బాగా పేరు తెచ్చే పాత్ర అవుతుంది అని సాయి పేర్కొన్నారు.నక్షత్రం చిత్రంలో  నటించే అవకాశం వచ్చిన తర్వాత అలెగ్జాండర్ చిరంజీవి, పవన్ కల్యాణ్ మామయ్యాలను కలిశాను. కృష్ణవంశీ సినిమాలో ఓ క్యారెక్టర్ చేస్తున్నాను అని వారికి చెప్పాను. అందుకు వారు వెరీ గుడ్. ఆల్ ది బెస్ట్ అన్నారు. కృష్ణవంశీ దగ్గర పనిచేస్తే నువ్వెంతో నేర్చుకొంటావని చిరంజీవి మావయ్య చెప్పారు అని అన్నారు.నక్షత్రం సినిమా నాకు మంచి అనుభవాన్ని ఇచ్చింది. కెరీర్ ఆరంభంలోనే భావోద్వేగమైన పాత్ర చేసే అవకాశం రావడం నిజంగా అద ృష?ం. ప్రతి రోజూ ఈ సినిమా షూటింగ్ కాలేజి స్టూడెంట్‌లా వెళ్లాను. కృష్ణవంశీ దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నాను అని సాయి తెలిపారు.

## ప్రభాస్ ఫ్యాన్‌గా మారిన బాలీవుడ్ హీరో..



బాహుబలి సంచలన విజయం తర్వాత యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానుల జాబితా భారీగా పెరిగిపోతున్నది. అయితే ఈ జాబితాలో సినీ స్టార్లు కూడా ఉండటం విశేషం. ప్రస్తుతం ప్రభాస్‌కు బాలీవుడ్ స్టార్ ఫ్యాన్‌గా మారిపోయాడు. అతను ఎవరంటే కపూర్ ఖాందాన్ నుంచి వచ్చిన రణ్‌బీర్ కపూర్. విభిన్నమైన పాత్రలతో, వరుస విజయాలతో దూసుకెళ్తున్న రణ్‌బీర్ ప్రభాస్‌పై ప్రశంసల వర్షం కురిపించడం గమనార్హం. రణ్‌బీర్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. ప్రభాస్ అంటే నాకు చెప్పలేనంత ఇష్టం కలుగుతున్నది.

బాహుబలి చిత్రంలో అదుర్తేంగా కనిపించారు. బాహుబలిగా ప్రభాస్ తప్ప మరొకరిని ఊహించుకోలేం. ప్రస్తుతం నేను ప్రభాస్ ఫ్యాన్‌గా మారిపోయాను అని చెప్పారు.

ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్ జగ్గా జాసూస్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన మాజీ ప్రేయసి కత్రినా కైఫ్ జోడిగా నటిస్తున్నది. స్వయంగా నిర్మాతగా మారి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు అనురాగ్ బసు డైరెక్షన్ చేశారు. ఈ చిత్రం జూలై 14న ప్రేక్షకుల ముందుకు వస్తున్నది. ఈ సినిమా తర్వాత నిర్మాతగా మరే చిత్రాన్ని నిర్మించబోనని రణ్ బీర్ అనూహ్యమైన నిర?యం తీసుకోవడం గమనార్హం. నేను నిర్మాతగా న్యాయం చేకూర్చలేను. ఆర్థిక వ్యవహారాలను చూసుకోవడంలో నేను అంతగా రాణించలేను. సినీ నిర్మాణ బాధ్యతలు నా వల్ల కావు. ఆ నిర్వహణ నాతో కాదు. దర్శకుడు అనురాగ్ బసు చాలా బాధ్యతలు పంచుకోవడంతో నా పని సులభమైంది అని రణ్ బీర్ అన్నారు.

ఇటీవల తనపై కత్రినా చేసిన వ్యాఖ్యలపై రణ్‌బీర్ చాలా ఫన్నీగా స్పందించారు. నేను ఓవర్ యాక్షన్ చేస్తానని కత్రినా చెప్పింది. అది వాస్తవమో కాదో తెలియదు. కానీ కత్రినాకు అసలు యాక్టింగ్ రాదని కత్రినానకు రణ్ బీర్ కౌంటర్ ఇచ్చాడు. చాలా చిత్రాల్లో కత్రినా నటించినట్టు ఎక్కడ కనిపించలేదని చురకలు అంటించారు.

## రోబో 2.0 స్థాయిలో



ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా స్పైడర్ సినిమాను తెరకెక్కిస్తున్న మురుగదాస్, త్వరలో మరో టాలీవుడ్ స్టార్ హీరోతో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో సినిమా ప్లాన్ చేస్తున్నారట. స్పైడర్ తర్వాత కోలీవుడ్ ఇళయదళపతి విజయ్‌తో మరో సినిమాను తెరకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నాడు మురుగ దాస్. ఈ సినిమా సెట్స్ మీదకు ఇంకా వెళ్లకుండానే ఆ తర్వాతి సినిమా గురించి ఆలోచిస్తున్నాడు. ఆ సినిమాను మరో తెలుగు హీరోతోనే చేయాలని ప్లాన్ చేస్తున్నారట కోలీవుడ్ నిర్మాతలు. మెగా ఫ్యామిలీ వారసుడు రామ్ చరణ్‌తో మురుగదాస్ జోడీ కట్టేలా కోలీవుడ్ నిర్మాతలు ప్రయత్నాలు ప్రారంభించారని తెలుస్తోంది. రొటీన్ ఫార్ములాకు భిన్నంగా సినిమాలు చేస్తున్న రామ్ చరణ్, మురుగదాస్ దర్శకత్వంలో కమర్షియల్ ఎంటర్ టైనర్ చేసేందుకు ఓకె చెప్తాడని భావిస్తున్నారు. అయితే ఈ సినిమా పట్టాలెక్కడానికి చాలా సమయం పట్టేలా ఉంది. ప్రస్తుతం రోబో 2.0 సినిమాను నిర్మిస్తున్న లైకా ప్రొడక్షన్స్.. మురుగదాస్-చెర్రీ కాంబినేషన్ కోసం ట్రై చేస్తోందని అంటున్నారు.

# నిర్దిష్ట గడువులోగా ఉపాధి పనులు పూర్తి కావాలి

## - లక్ష్యాలను చేరని వారిపై చర్యలు తప్పవు
## - ఉపాధి హామీ కన్వర్జెన్స్ సమీక్షలో జిల్లా కలెక్టర్ స్పష్టం



విశాఖపట్నం: ఉపాధి హామీ పథకం క్రింద చేపడుతున్న ప్రతి పనికి ఒక కాల పరిమితిని సూచించడం జరిగిందని, ఆ గడువులోగా పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించి పనుల వారీగా పురోగతిపై సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కింద పనులు సృష్టించకపోతే మెటీరియల్ కాంపొనెంట్ రాదని, మెటీరియల్ కాంపొనెంట్ పనులకు ముఖ్యమని, ఎక్కువమంది కూలీలను మోటివేట్ చేసి ఎక్కువ పని దినాలను కల్పించాలని ఆదేశించారు. పనిదినాలు, లేబర్ బడ్జెట్ నిష్పత్తి చూస్తే జిల్లా సరాసరి 85.95 శాతంగా వుందని, అనంతగిరి, ముంచింగుపుట్టు, అచ్యుతాపురం, అనకాపల్లి మండలాల్లో 100శాతం కంటే తక్కువగా వుందని, దీనివలన జిల్లా సరాసరి తగ్గిందని, తగ్గడానికి గల కారణాలపై ఆయా మండలాధికారులను ఆరా తీశారు. జిల్లాలో సరాసరి వేతనం రోజుకు రూ.147.75లుగా వుందని, ఉపాధి హామీ చట్టం ప్రకారం ఎంతమందికి పని కల్పించాం, ఎంత వేతనాలు చెల్లించాం అనేదే ముఖ్యమని అన్నారు. ఈ పథకం కింద సిసిరోడ్లు, పంచాయితీ భవనాలు, ఉద్యాన వనాలు, అంగన్వాడీ భవనాలు తదితర పనులెన్ని చేస్తున్నా ప్రధానంగా పనిదినాలు, వేతనాల చెల్లింపులు, ఖర్చు, మెటీరియల్ కాంపొనెంట్, అప్‌లోడేషన్ లే కీ ఇండికేటర్లని, వీటిలో దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని, మండల ప్రోగ్రాం అధికారిగా ఎంపీడీవోదే ప్రధాన బాధ్యత అని, ఎపిఓలతో పనిచేయించాలని లక్ష్యాలను చేరని వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈనెల 15లోగా ఉపాధి హామీ క్రింద మొక్కలు నాటడానికి గోతులు తవ్వడం పూర్తి చేయాలని ఆదేశించారు. చేసే ప్రతి పనికి జియో ట్యాగింగు చేయాలన్నారు.

యూనిసెఫ్ ప్రతినిధి వెంకటేష్ శానిటేషన్ పై మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన లేని గ్రామాలుగా మార్చడానికి దేశంలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు ఎస్.రాయవరం, ఎంపిపి తిరమలరావు, కల్యాణ చక్రవర్తి, సత్యసాయి శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎపిఓలు, ఎపిడిలు, జిల్లా అధికారులు హాజరైనారు.

# దార్శనిక నాయకుడు జగ్జీవన్‌రామ్

## నివాళి అర్పించిన వర్సిటీ అధికారులు

విశాఖపట్నం : దార్శనికతో దేశ ప్రగతికి బాటలు వేసిన నాయకునిగా బాబు జగ్జీవన్‌రామ్ నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. గురువారం ఉదయం ఏయూలోని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తన సమర్ధత, పరిపాలన దక్షతతో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అవిరళ కృషిజరిపారన్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.ఇ బాబు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.ప్రమీల దేవి, డీన్ ఆచార్య కె.నిరంజన్, ఆచార్య వై.సత్యనారాయణ, కె.జాన్, టి.వి క్రిష్ణ, పి.ప్రేమానందం, ఎన్.ఏ.డి పాల్, షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ కోసం ఉద్యోగం వదులుకుని..



న్యూఢిల్లీ : లక్షల్లో వేతనం.. ఎంఎన్‌సీలో ఉద్యోగం. ఏసీ గదుల్లో విధులు. ఇంతకుమించి అవకాశం వస్తే ఎవరు మాత్రం కాదనుకుంటారు. అయినా వద్దనుకుంది! ఉన్నత స్థాయి ప్రభుత్వ కొలువు. గౌరవప్రదమైన వృత్తిని పక్కనపెట్టింది. ఇంతకుమించిన అవకాశమేమైనా వచ్చిందా? ఆమెను ఇంకేదైనా ప్రభావితం చేసిందా? అవును.. దేశం తరపున.. దేశం కోసం.. ఆడే అవకాశం ఆమెను ఎంఎన్‌సీ ఉద్యోగాన్ని కాదనేలా చేసింది. క్రికెట్‌పై ఆమెకున్న మక్కువ.. బంతిపై ఉన్న మమకారం ప్రభుత్వ కొలువులో కొనసాగుతూనే జాతీయ జట్టులో చేరే దిశగా ప్రేరేపించింది. ఆమెవరో కాదు మహిళా ప్రపంచకప్‌లో భారత పేస్ సంచలనం.. శిఖా పాండే!!

శిఖా పాండేది దేశంలోనే అతి చిన్న రాష్ట్రమైన గోవా. చిన్నతనం నుంచి చదువులో చురుకుదనం. మరోవైపు 15 ఏళ్ల ప్రాయంలోనే 2004 నుంచి గోవా తరపున మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైంది. 2007-08 సీజన్‌లో గోవా మహిళల సీనియర్ జట్టుకు ఆడింది. ఒకవైపు చదువులో కొనసాగుతూనే మరోవైపు క్రికెట్‌లో రాణిస్తోంది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ఎంఎన్‌సీల్లో ఓ వైపు ఉద్యోగాలు వస్తున్నా.. జాతీయ జట్టులో స్థానం కోసం వాటిని వద్దనుకుంది. అయితే 2010 ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేయకపోవడంతో అనంతరం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం సాధించింది. శిక్షణ పూర్తిచేసుకుని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించింది. కష్టతరమైన ఉద్యోగం అయినప్పటికీ.. తన కలల క్రికెట్‌ను వీడలేదు శిఖా. ఆమె ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు 2014 బంగ్లాదేశ్‌తో టీ20 పర్యటనకు జట్టుకు ఎంపికచేశారు. అందులో తన సత్తాను చాటిన శిఖా.. ప్రస్తుతం మహిళా ప్రపంచకప్‌లో పేస్ బౌలర్‌గా రాణిస్తోంది. ఓపెనర్ బౌలర్ జులన్ గోస్వామితో కలిసి ఓపెనింగ్ బౌలింగ్ చేస్తోంది. ఇంకో విషమేంటంటే గోవా తరఫున పురుషుల్లో గానీ, మహిళల్లో గానీ ఇప్పటి వరకు ఎవరూ జాతీయ జట్టుకు ఎంపిక కాలేదు. ఆ ఘనత కూడా శిఖాకే దక్కడం విశేషం.

# జీఎస్టీపై రోజుకు 10వేల ఫోన్‌కాల్స్



దిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థలో నవశకంగా అభివర్ణిస్తూ.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వస్తు-సేవల పన్ను(జీఎస్టీ)పై ఇంకా సందేహాలు, అనుమానాలు వస్తూనే ఉన్నాయి. తమకు వచ్చే సందేహాలను నివృత్తి చేసుకొనేందుకు జీఎస్టీ నెట్‌వర్క్‌కు చెందిన హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రజలు ఆశ్రయిస్తున్నారు వర్తకులు, పన్ను చెల్లింపుదారులు. జీఎస్టీపై వ్యాపారుల్లో ఇంకా కాస్త గందరగోళం నెలకొందని, దాని గురించి పూర్తిగా తెలుసుకునేందుకు తమ కాల్ సెంటర్‌కు ఫోన్లు చేస్తున్నారని జీఎస్టీఎన్ ఛైర్మన్ నవీన్ కుమార్ అన్నారు. సగటున రోజుకు 10వేల కాల్స్ వస్తున్నట్లు చెప్పారు. నోయిడా నుంచి ఆపరేట్ చేస్తున్న ఈ కాల్‌సెంటర్‌లో 400 మంది ఎగ్జిక్యూటివ్‌ల బృందం వినియోగదారుల సందేహాలను నివృత్తి చేస్తోందని వివరించారు.ఒకే దేశం- ఒకే పన్ను నినాదంతో కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్నును జులై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

# రజనీ ఆస్తులపై ఈడీతో విచారణ జరపాలి

## ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి



దిల్లీ: భాజపా ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి మరోసారి సూపర్‌స్టార్ రజనీకాంత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రజనీ వైద్యపరీక్షల నిమిత్తం అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. అక్కడ రజనీ ఓ క్యాసినోలో కూర్చున్న ఫొటోను స్వామి తన ట్విటర్‌లో పోస్ట్ చేశారు. వావ్..! రజనీకాంత్ అమెరికాలోని ఓ క్యాసినోకి వెళ్లారు. తన ఆరోగ్యం కుదుటపడాలని గ్యాంబ్లింగ్ చేస్తున్నారేమో. రజనీకి అంత డబ్బు ఎక్కడిదో ఈడీ వెంటనే విచారణ చేపట్టాలి అంటూ ట్వీట్ చేశారు. ఇదివరకు కూడా రజనీపై సుబ్రహ్మణ్య స్వామి సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. తలైవా రాజకీయ అరంగేట్రంపై స్వామి స్పందిస్తూ..

ఆయన నిజంగానే తమిళ వ్యక్తి అని నిరూపించుకోవాలని, రాజకీయాల్లోకి వస్తే వ్యవస్థ నాశనమవుతుందన్నారు. అంతేకాకుండా రజనీ రాజకీయాలకు పనికిరారంటూ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

# లంక, కివీస్‌తో బీసీసీఐ చర్చలు



దిల్లీ: వెస్టిండీస్‌తో ఐదు వన్డేలు, ఒక టీ20 సిరీస్ అనంతరం భారత జట్టు శ్రీలంకలో పర్యటించనుంది. ఈ పర్యటనలో ఆతిథ్య జట్టుతో భారత్ వన్డే, టెస్టు, టీ20 సిరీస్‌లను ఆడనుంది. సెప్టెంబరులో శ్రీలంక పర్యటన ముగించుకుని కోహ్లి సేన భారత్ రానుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో ఆడాల్సి ఉంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా క్రికెటర్లు పాల్గొనే సిరీస్‌లు ప్రశ్నార్థకంగా మారిన సంగతి తెలిసిందే. జీతభత్యాల విషయంలో క్రికెటర్లకి-ఆస్ట్రేలియా బోర్డు మధ్య వివాదాలు తారస్థాయికి చేరడంతో ఇప్పటికే దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా-ఎ బహిష్కరించింది. దీంతో బీసీసీఐ ఆలోచనలో పడింది. ఆస్ట్రేలియాతో సిరీస్ రద్దైతే ఆటగాళ్లు సుమారు 5 నెలల పాటు క్రికెట్‌కి దూరంగా ఉండాల్సి వస్తోంది. తిరిగి 2018 జనవరిలో దక్షిణాఫ్రికాతో ఆడనున్నారు.

దీనిపై చర్చించిన బీసీసీఐ నవంబరు, డిసెంబరులో శ్రీలంక, న్యూజిలాండ్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు నిర్వహించాలని చూస్తోంది. ఇప్పటికే శ్రీలంక బోర్డుతో మాట్లాడగా... వారి నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు సమాచారం. న్యూజిలాండ్ బోర్డుతో కూడా బీసీసీఐ వర్గాలు చర్చలు జరపగా వారి నుంచి ఇంకా ఎలాంటి స్పందన రానట్లుగా తెలుస్తోంది.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచిననాడే

# సంపూర్ణ స్వచ్ఛాంధ్ర సాధ్యం



**మొదటి పేజి తరువాయి :**

అక్షరాస్యత ముఖ్యమన్నారు. అన్ని కలిసిననాడే స్వచ్ఛాంధ్రను సాధించగలమని అన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్-స్వచ్ఛ సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొన్న వారందరి లోను అంకితభావం, పట్టుదల కనబడుతున్నదని ప్రశంసించారు.

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను ఓడియఫ్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలను చేపట్టడం జరుగుచున్న దన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1.5 లక్షల కుటుంబాలు వున్నాయని, 2018 నాటికి ఒడియఫ్‌గా చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. 2017-18 సంవత్సరానికి సంబంధించి 85వేల మరుగుదొడ్లను నిర్మించే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు.

2018-19 నాటికి 2,09,547 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను 544 గ్రామ పంచాయితీలలో నిర్మించనున్నా మన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ లాలం భవాని, శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు, వంగలపూడి అనిత, కిడారి సర్వేశ్వర రావు, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఎండి మురళీధర్‌రెడ్డి, యునిసెఫ్ సిఇఒ మితాల్ రశ్మియా, సిఇఓ జయప్రకాష్ నారాయణ, మెహర్ ప్రసాద్, కల్యాణ చక్రవర్తి, కృష్ణకుమారి, జిల్లా వ్యాప్తంగా సర్పంచ్‌లు, ఎంపీపీలు, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



# శబరిమల హుండీలోకి పాక్ కరెన్సీ ఎలా వచ్చింది !




తిరువనంతపురం: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో పాకిస్థాన్ కరెన్సీ కలకలం రేపింది. ఆలయంలోని హుండీలో ఒక పాకిస్థానీ కరెన్సీ నోటును పోలీసులు గుర్తించారు. ఆలయ సిబ్బంది హుండీని తెరచి నగదు లెక్కిస్తుండగా, వారికి పాకిస్థాన్‌కు చెందిన 20 రూపాయల నోటు కనిపించింది. ఆ నోటు ముడతలు పడిపోయిన స్థితిలో లభ్యమైంది. జూన్ 28న ఆలయం తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నందర్భంగా ఎవరో హుండీలో వేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆలయ హుండీలో అన్ని దేశాల కరెన్సీ వస్తుంటుందని, అయితే తొలిసారిగా పాకిస్థాన్ కరెన్సీ వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారని పథానంమిట్ట ఎస్పి సతీష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, ఇంటెలిజెన్స్ బ్యూరో కు తెలియజేశామన్నారు. హుండీలో ఈ నోటును ఎవరువేశారని తెలుసుకునేందుకు సీసీ ఫుటేజ్ పరిశీలించామన్నారు. అయినా ఫలితం లేదన్నారు. అయితే అనుమానం ఉన్న అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఓవర్ లోడ్.. 70 మందిని బలిగొంది

బంగుయ్ : సెంట్రల్ ఆఫ్రికాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఒవర్ లోడ్, ప్రయాణికులతో వెళుతున్నట్రక్కు అదుపు తప్పి బోల్తా పడింది. దాంతో 78 మంది అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. అయితే గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించకుండా నేరుగా వారి ఇళ్లకే పంపడం గమనార్హం.

ఓ పక్క ఓవర్ లోడ్, మరోపక్క ప్రయాణికులను ఎక్కించుకోవడమే కాకుండా ట్రక్కును అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు వెల్లడించారు. పలు గ్రామాల్లో సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో ప్రజలు ఎక్కువగా లారీలు, ట్రక్కుల్లో ప్రయాణిస్తుంటారని.. అవి కూడా సరైన కండిషన్‌లో ఉండవని పేర్కొన్నారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com